నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 11-4-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 220 పేజీలు: 4 వెల: రూ.1/-

కరోనాపై భారత్, నేపాల్ ఉమ్మడి పోరు

-ట్వీట్ చేసిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): ప్రపంచ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కరోనా మహమ్మారిపై ఉమ్మడిగా పోరాటం చేసేందుకు భారత్, నేపాల్ ప్రధానుల మధ్య అంగీకారం కుదిరింది. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీ, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి శుక్రవారం టెలీఫోన్‌లో మాట్లాడుకుని అంగీకారం చేసుకున్నారు. శుక్రవారం తాను నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలితో మాట్లాడానని, కరోనావల్ల తలెత్తుతున్న పరిస్థితిపై చర్చలు జరిపామని, కొవిడ్-19 కట్టడికి సమిష్టిగా పోరాడుదామని ఈ సందర్భంగా నిర్ణయించుకున్నామని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ ట్వీట్ చేసిన కొద్ది నిమిషాలకే నేపాల్ ప్రధాని ఓలి ట్విటర్లో స్పందించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో తాను ఇవాళ ఫోన్‌లో మాట్లాడానని, కరోనా వైరస్‌పై మరింత నిబద్ధతో పోరాడాలని ఈ సందర్భంగా పరస్పరం అంగీకరించామని, ప్రస్తుతం కొనసాగుతున్న లాక్‌డౌన్ వల్ల ఇరువైపులా చిక్కుకున్న తమ పౌరులను క్షేమంగా చూసుకోవాలని నిర్ణయించుకున్నామని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో గత నెల 25 నుంచి లాక్‌డౌన్ కొనసాగుతుండగా, నేపాల్‌లో అంతకంటే ఒకరోజు ముందు నుంచే లాక్‌డౌన్ అమల్లోకి వచ్చింది.

నేడు ముఖ్యమంత్రులతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

లాక్‌డౌన్ నేపథ్యంలో తాజా పరిస్థితులపై చర్చించే అవకాశం

ఆర్థిక పరిస్థితులు..లాక్‌డౌన్‌పై సిఎంల అభిప్రాయ సేకరణ

పరిమితంగా కొన్ని రంగాలకు మినహాయింపు ఇచ్చే అంశాలపై చర్చ

మంగళవారం జాతిని ఉద్దేశించి మరోమారు ప్రసగించనున్న మోడీ?

న్యూఢిల్లీ,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ మరింత విస్తరించకుండా దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్ మంగళవారంతో ముగుస్తున్న నేపథ్యంలో శనివారం ప్రధాని మోడీ శనివారం రాష్ట్రాల సిఎంలతో చర్చించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాజా పరిస్థితులను, లాక్‌డౌన్ పొడిగింపుపై వచ్చిన డిమాండ్లపై చర్చించనున్నారు. మార్చి 24వ తేదీ నుంచి మూడువారాలు అంటే ఏప్రిల్ 14 వరకు లాక్‌డౌన్ అమల్లో ఉంటుందని ప్రధాని మోడీ స్పష్టంచేశారు. కానీ దేశంలో వైరస్ తీవ్రత ఏ మాత్రం తగ్గలేదు. పాజిటివ్ కేసులు 6 వేలకు చేరడం తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. అధికారుల నుంచి వివరణ తీసుకుంటున్నది. లాక్ డౌన్ పొడిగించాలని సీఎం కేసీఆర్ మీడియాముఖంగా ప్రధానిని కోరగా.. ఒడిశాలో ఈ నెల 30వ తేదీ వరకు అమల్లో ఉంటుందని ఆ రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నది. ఈ దశలో ముఖ్యమంత్రులతో ప్రధాని మోడీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించబోతున్నారు. ఆ సమావేశంలో సీఎంల అభిప్రాయం తీసుకొని లాక్‌డౌన్ పొడిగించే అవకాశాలు ఉన్నాయి. మార్చి 23వ తేదీ మాదిరిగా.. ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి మీడియా ముందుకు వచ్చే అవకాశం ఉంది. రెండో విడత లాక్‌డౌన్‌లో కొన్ని ముఖ్య మార్పులు ఉండబోతున్నట్టు తెలుస్తోంది. స్కూళ్లు, కాలేజీలు, ప్రార్థన స్థలాలు మూసివేస్తామని సంకేతాలు ఇచ్చింది. సామాజిక దూరం పాటిస్తూనే కొన్నింటికీ అనుమతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. లాక్ డౌన వల్ల పరిస్థితిని రిజర్వ్ బ్యాంక్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.. దీంతో కొన్ని రంగాలకు మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంది. వైమానిక రంగం కూడా భారీగా నష్టపోయింది. విమాన సేవలను పునరుద్ధరించాలని.. అయితే ప్రతీ విమానంలో గల అన్ని తరగతుల్లో మధ్య సీటు ఖాళీగా ఉంచడంపై సమాలోచనలు చేస్తుంది. లాక్ డౌన్ గురించి బుధవారం అఖిలపక్ష నేతలతో ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు లాన్ డౌన్ ఎత్తివేయబోమని చెప్పారు. కొన్నింటికీ మినహాయింపులు ఇస్తామని పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. వైరస్ బారి నుంచి ప్రజలను కాపాడటమే తమ ప్రాథమిక విధి అని మోడీ స్పష్టంచేశారు. కరోనా మహమ్మారిపై ఐకమత్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది అని అభిప్రాయపడ్డారు. లాక్ డౌన్ పొడిగింపు సహా కొన్ని రంగాలకు మినహాయింపు ఇస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాని మోడీ మరోసారి మీడియా ముందుకు కూడా వస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే ఆయన ఏ రోజు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారనే అంశంపై మాత్రం స్పష్టత లేదు. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాక్‌డౌన్‌పై మంగళవారం కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. ఆ రోజు జాతినుద్దేశించి ప్రసంగిస్తూ లాక్‌డౌన్ పొడగించాలా? వద్దా? అన్న నిర్ణయాన్ని వెల్లడిస్తారని ఢిల్లీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిర్ణయాన్ని ప్రకటించే ముందే అదే రోజు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం లాక్‌డౌన్ పొడగింపుకే మోదీ మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. అయితే అనేక మార్పులతో లాక్‌డౌన్ కొనసాగిస్తారని సమాచారం. అంతర్రాష్ట్ర రవాణాపై ఆంక్షలు విధించనున్నట్లు సమాచారం. అయితే అత్యవసర సర్వీసులకు మాత్రం ఇందుకు మినహాయింపు ఇవ్వనున్నారని సీనియర్ అధికారులు తెలిపారు. ఇక, విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలను మూసే ఉంచుతారని స్పష్టం చేశారు. దేశవ్యాప్త లాక్‌డౌన్ కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతిన్న కారణంగా, కొన్ని రంగాలకు ప్రత్యేక మినహాయింపులు ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే అక్కడ సామాజిక దూరం కచ్చితంగా పాటించాలన్న కఠిన నిబంధనల ను కేంద్రం విధించినుంది. అత్యంతగా నష్టపోయిన రంగాల్లో విమాన రంగం ప్రథమ వరుసలో ఉంది. దీంతో విమానాల రాకపోకలను క్రమంగా ప్రారంభించవచ్చని అయితే, అన్ని తరగతులలో మధ్య సీటు ఖాళీగా ఉంచాలన్న నిబంధనను తెరపైకి తేనున్నట్లు సమాచారం. దేశంలోని ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. దేశంలో పరిస్థితి చూస్తుంటే 'సామాజిక అత్యవసర పరిస్థితి' తో సమానంగా ఉందని, కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్న విషయం తెలిసిందే.

దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు

వివిధ రాష్ట్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు

న్యూఢిల్లీ,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా కరోనా విళయతాండవం చేస్తోంది. ఇప్పటి వరకు దేశంలో మొత్తం 6412 పాజిటివ్ కేసులు నమోదవ్వగా.. అందులో 5,709 యాక్టివ్ కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది. మొత్తం 199 మంది ప్రాణాలు కోల్పోగా.. 504 మంది డిశ్చార్జ్ అయినట్లు తెలిపింది. గడిచిన 24 గంటల్లో 678 పాజిటివ్ కేసులు నమోదు కాగా.. 30 మంది మృతి చెందినట్లు వెల్లడించింది. ఇక మహారాష్ట్రలో అత్యధికంగా 1364 కేసులు నమోదయ్యాయి. ఈ రాష్ట్రంలో మరణాల సంఖ్య కూడా 97కు చేరింది. తాజా సమాచారం ప్రకారం ఏపీ-348, అండమాన్ నికోబార్ ఐలాండ్స్ - 11, అరుణాచల్ ప్రదేశ్ - 1, అస్సాం - 29, బీహార్ - 39, ఛండీగర్-18, ఛత్తీస్‌ఘడ్-10, ఢిల్లీ-720, గోవా-7, గుజరాత్-241, హర్యానా-169, హిమాచల్‌ప్రదేశ్-18, జమ్ముకశ్మీర్-158, జార్ఖండ్ - 13, కర్ణాటక-181, కేరళ-357, లడాక్-15, మధ్యప్రదేశ్-259, మహారాష్ట్ర-1364, మణిపూర్-2, మిజోరం- 1, ఒడిశా - 44, పుదుచ్చేరి -5, పంజాబ్-101, రాజస్థాన్-463, తమిళనాడు-834, తెలంగాణ-442, త్రిపుర - 1, ఉత్తరాఖండ్ - 35, యూపీ-410, పశ్చిమ బెంగాల్-116 కేసులు ఉన్నాయి.

హాట్‌స్పాట్ కేంద్రల్లో కఠిన ఆంక్షలు

బారికేడ్లో జనం రాకుండా చర్యలు

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ ఎన్ఎ):కరోనా కేసులు ఎక్కువ సంఖ్యలో వెలుగు చూస్తున్న ప్రాంతాలను తెలంగాణ ప్రభుత్వం హాట్‌స్పాట్‌గా ప్రకటించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 130 ప్రాంతాలను గుర్తించి, మూడు వేల మంది వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అక్కడ మోహరించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ కంటైన్మెంట్ క్లస్టర్లుగా గుర్తించిన ప్రాంతాల్లో పోలీసులు, జీహెచ్ఎంసీ, వైద్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా ప్రాంతాలలో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు రాకపోకలను నిలిపివేశారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు ఆయా ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటినీ సర్వే చేస్తున్నారు. దగ్గు, జలుబు, జ్వరం వచ్చిన వారిని క్వారంటైన్‌లో ఉంచుతుండగా, కరోనా అనుమానితులను దవాఖానలకు తరలిస్తున్నారు. కంటైన్మెంట్ ప్రాంతంగా గుర్తించిన మల్లేపల్లిలో డీజీపీ ఎం మహేందర్‌రెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ పర్యటించారు. కంటైన్మెంట్ ప్రాంతంగా ప్రకటించబడ్డ బడీ మసీదు, దాని పరిసరాలలో ఆయన పర్యటించి ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను, సీసీ కెమెరాలను పరిశీలించారు. రాకపోకలు నిలిపివేసి పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎస్ అధికారులకు సూచించారు.

లాక్‌డౌన్ వేళ నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

కరోనా వ్యాప్తి...లాక్‌డౌన్ పొడిగింపుపై చర్చ

ధాన్యం సేకరణ, గన్నీ బ్యాగుల కొరతపైనా సమీక్ష

వడగళ్లతో దెబ్బతిన్న పంటలపైనా అంచనాలు

ఆర్థిక పరిస్థితులపైనా చర్చించే అవకాశం

సిఎం కెసిఆర్ అధ్యక్షతన ప్రగతిభవన్‌లో 3గంటలకు సమావేశం

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తి నేపథ్యంలో అమలవుతున్న లాక్‌డౌన్ పూర్వాపరాలపై చర్చించేందుకు తెలంగాణ కేబినేట్ ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక సమావేశం జరుగుతుంది. కరోనా వైరస్ వ్యాప్తి, దాని వల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై ఈ కేబినెట్ సమావేశంలో విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. కరోనా వ్యాప్తిని నిరోధించడానికి అమలు చేస్తున్న లాక్‌డౌన్ ఫలితాలను ప్రత్యేకంగా చర్చించనున్నారు. లాక్‌డౌన్‌కు ముందు, తరవాత పరిస్థితులను సమీక్షించ నున్నారు. అలాగే కొత్త కేసులు, తబ్లిగి ఎఫెక్ట్ తరవాత జరిగిన పరిణామాలను కూడా చర్చించే అవకాశం ఉంది. దీంతో పాటు లాక్‌డౌన్ పొడిగించాలని సిఎం కెసిఆర్ ఇప్పటికే ప్రతిపాదించారు. తెలంగాణలో కొత్తగా 18 పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రోగుల సంఖ్య 471కి చేరింది. బాధితుల్లో 388 మంది మర్కజ్‌కు వెళ్లివచ్చినవారు ఉన్నారని, వారితో కలిసినవారు కూడా ఉన్నారు. రాష్ట్రంలో కరోనా పాజిటీవ్‌గా తేలి చికిత్స పొందుతున్నవారంతా ఈనెల 24వ తేదీకల్లా కోలుకుంటారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. మర్కజ్ కేసులు లేకుంటే.. ఇప్పటికే తెలంగాణ కరోనా రహితం అయ్యేదని అన్నారు. శుక్రవారం నుంచి కేసులు తగ్గుముఖం పడతాయని 4,5 రోజుల తర్వాత అనలు ఉండవని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా తెలంగాణలో కరోనాతో ఇంత వరకు 12 మంది చనిపోయారు. 45 మంది డిశ్చార్జ్ అయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీ, కింగ్ కోటి ఆస్పత్రిలో 414 మంది చికిత్స పొందుతున్నారు. మర్కజ్ లింకు ఉన్నవాళ్లలో శుక్రవారం 60 నుంచి 70 మంది డిశ్చార్జ్ కానున్నారు. శనివారం ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్ తర్వాత లాక్ డౌన్‌పై సీఎం కేసీఆర్ స్పష్టత ఇస్తారని మంత్రి తెలిపారు.

ఈ క్రమంలో లాక్‌డౌన్ పొడిగించే అంశం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ వ్యూహ రూపకల్పన, రాష్ట్రంలోని పేదలు, ఇతర రాష్ట్రాలనుంచి వలస వచ్చిన కార్మికులకు అందుతున్న సాయం, మామిడి, బత్తాయి పండ్ల మార్కెట్లు, వ్యవసాయ కొనుగోళ్లు, వడగండ్ల వాన నష్టం తదితర అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. అనూహ్యంగా కూలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. అలాగే వడగండ్లతో పలుచోట్ల వరి,మిర్చి, మామిడి, మక్కజొన్న దెబ్బతిన్నది. మరోవైపు ధాన్యం సేకరణ సాగుతోంది. లాక్‌డౌన్ కొనసాగుతున్న వేళ ధాన్యం సేకరణ సాఫీగా సాగేలా చూడాల్సి ఉంది. అలాగే ధాన్యం సేకరణకు గన్నీ బ్యాగుల కొరత తీవ్రంగా ఉంది. వీటన్నింటిన అధిగమించేలా కర్యాచరణ రూపొందించాల్స ఉంది. ఈ కేబినేట్‌లో ఈ అంశాలపై కూలంకశంగా చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

అమెరికాలో పెరుగుతున్న కరోనా బాధితులు

ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం మార్గదర్శకాలు

బిల్లులతో గుండెగుభేల్‌మనేలా చేయకుండా ఆదేశాలు

హార్ట్ ఐలాండ్‌లో అనాథ శవాల ఖననం

వాషింగ్టన్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): అమెరికాలో కరోనా వైరస్ రోజురోజుకూ విజృంభిస్తుండటంతో రోగులు అష్టకష్టాలు పడుతున్నారు. అక్కడ పెద్దమొత్తంలో వేటువే కావటంతో వైద్యం కోసం రోగులు వేల డాలర్లు ఖర్చు చేయాల్సి వస్తున్నది. ముఖ్యంగా హెల్త్ ఇన్సూరెన్స్ అందుబాటులో లేని దవాఖానల్లో వైద్యం పొందుతున్నవారు, ఇన్సూరెన్స్ వర్తించని వైద్యుల సేవలు పొందుతున్నవారికి దవాఖానలు బిల్లులతో షాకిస్తున్నాయి. దాంతో అధ్యక్షభవనం వైట్‌హౌస్ దీనిపై తీవ్రంగా స్పందించింది. కరోనా సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రకటించిన రెండు ట్రిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీలోంచి దవాఖానలకు కూడా నిధులు అందుతున్నందున రోగులను షాక్‌కు గురిచేసే బిల్లులేవీ వారికి వేయరాదని ఆదేశించింది. అమెరికన్లు ఎవరూ వైద్యపరీక్షలు, వైద్యసేవలకు సంబంధించిన బిల్లుల వల్ల ఆందోళన, ఆశ్చర్యపడకుండా చూడటం అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం బాధ్యత అని వైట్‌హౌస్ ప్రతినిధి జడ్ డీర్ స్పష్టంచేశారు. నిజానికి అక్కడ వైద్య ఖర్చుల కారణంగా చాలామంది ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు వైరస్ వ్యాప్తి కారణంగా ఆందోళన తీవ్రమయ్యింది. అక్కడ మరణాల సంఖ్యా పెరుగుతోంది. ఇకపోతే కరోనా వైరస్ వల్ల మృతిచెందిన వారిని హార్ట్ ఐలాండ్‌లో ఖననం చేస్తున్నారు. మృతిచెందిన వారికి బంధువులు లేకున్నా, శవాలను ఖననం చేసే స్తోమత లేకున్నా.. అలాంటి మృతదేహాలను సాధారణంగా హార్ట్ ఐలాండ్‌కు తరలిస్తుంటారు. తూర్పు బ్రాంక్స్ సమీపంలో ఈ చిన్న దీవి ఉన్నది. 1800 సంవత్సరం నుంచి ఈ దీవిని ఖననాల కోసమే వాడుతున్నారు. తాజా లెక్కల ప్రకారం కరోనావల్ల న్యూయార్క్‌లో సుమారు 5000 మందికిపైగా చనిపోయారు. రెండు వారాల నుంచి కూడా సొంతం చేసుకునేందుకు రానటువంటి శవాలను హాస్పటల్లో ఉన్నట్లు న్యూయార్క్ మేయర్ ప్రెస్ సెక్రటరీ ఫ్రెడ్డీ గోల్డ్‌స్టీన్ తెలిపారు. ఒకవేళ మార్చరీ అధికారులతో ఎవరైనా తమ బంధువుల సమాచారాన్ని చేరవేస్తే, అలాంటి మృతదేహాలను దాచి పెడుతున్నామని ఆ అధికారి తెలిఎారు. అనాథ శవాలను మాత్రం తామే హార్ట్ ఐలాండ్‌లో ఖననం చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాలను మోసుకువెళ్లి ఖననం చేసేందుకు పనివారు దొరకడం లేదు. దీంతో కొన్ని జైళ్ల నుంచి ఖైదీలను ఇలాంటి పనులకు వాడుకుంటున్నారు. వారికి స్వల్పంగా కొంత మొత్తాన్ని ముట్టచెబుతున్నారు. హార్ట్ ఐలాండ్‌లో ప్రస్తుతం రోజుకు 25 మందిని సమాధి చేస్తున్నట్లు తెలుస్తోంది. వారానికి అయిదు రోజుల పాటు ఆస్పత్రి వర్గాలు ఈ పనిలో నిమగ్నమై ఉంటున్నాయి. రిఫ్రిజిరేటెడ్ ట్రక్కుల్లో మృతదేహాలను దీవికి తరలిస్తున్నారు. వైరస్ కారణంగా ఎవరిని కూడా అంత్యక్రియలకు రానీయడం లేదు.

తమపౌరులను వెనక్కి రప్పిస్తున్న బ్రిటన్

ప్రత్యేక విమానాల్లో లండన్‌కు తరలింపు

న్యూఢిల్లీ,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): భారత్‌లో చిక్కుకుపోయిన మూడు వేల మంది బ్రిటన్ దేశస్థులను తీసుకుని వెళ్లేందుకు ఆ దేశ విదేశాంగ శాఖ ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దీని కోసం ఏడు విమానాలను రెడీ చేసినట్ల బ్రిటన్ అధికారులు వెల్లడించారు. దీంతో లాక్‌డౌన్ సమయంలో భారత్ నుంచి బ్రిటన్‌కు తీసుకువెళ్లిన ఆ దేశస్థుల సంఖ్య 5వేలకు చేరుకుంటుంది. భారత్‌లో వేరువేరు ప్రాంతాల్లో చిక్కుకున్న బ్రిటన్ దేశస్తులను మొదట ఒక దగ్గరికి చేర్చి, ఆ తర్వాత వారిని ప్రత్యేక విమానాల్లో బ్రిటన్‌కు తీసుకువెళ్తారని దక్షిణాసియా కామన్‌వెల్త్ అధికారి లార్డ్ తారిక్ అహ్మద్ తెలిపారు. కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు మార్చి 24వ తేదీన ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించడంతో.. చాలా దేశాలకు చెందిన టూరిస్టులు ఇక్కడే చిక్కుకుపోయారు. వారందరినీ తరలించేందుకు ఆయా దేశాల ఎంబసీలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుగుతున్నాయి. ఏప్రిల్ 14 వరకు లాక్‌డౌన్ ఉన్నా.. ఆ ఆంక్షలను మరింత పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో బ్రిటన్ దేశస్థులను వారి దేశానికి పంపేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పేదలకు ఇచ్చే అంగన్‌వాడీ సరుకులు ఆగొద్దు

లాక్‌డౌన్ నేపథ్యంలో బాలింతలు, గర్భిణీలకు ఇంటికే సరఫరా

రెండో విడత అంగన్‌వాడీ సరుకులు పంపించే చేపట్టిన మంత్రి సత్యవతి

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): పేద ప్రజలకు ఇచ్చే అంగన్‌వాడీ సరుకుల పంపిణీ ఆగొద్దని రాష్ట్ర మహిళా-శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో బాలింతలు, గర్భిణీలు, పిల్లలకు అందించే పాలు, గుడ్లు, బాలామృతం, నిత్యావసరాలు ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నామన్నారు. వీరికి శానిటైజర్లు, మాస్కులు అందజేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ ఎంబీనగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లాక్‌డౌన్ అయిన వెంటనే అంగన్‌వాడీల ద్వారా మొదటిదశలో 12 రోజులకు సరిపడా సరుకులు అందించామన్నారు. శుక్రవారం నుంచి రెండో విడత అంగన్‌వాడీ సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పాలు, గుడ్లు, నూనె, పప్పు, బియ్యం, బాలామృతం, నిత్యావసరాలకు ఎలాంటి కొరత లేకుండా ఎప్పటికప్పుడు ప్రభుత్వం పర్యవేక్షిస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు శానిటైజర్లు, మాస్కులు అందించామన్నారు. కరోనాకు మందులేదని సామాజికదూరం, వ్యక్తిగత పరిశుభ్రతే దీనికి పరమ ఔషదంకావునా అంగన్‌వాడీలు పాటిస్తూ మిగిలిన వారంతా కూడా పాటించేలా చూడాలన్నారు. కరోనా మహమ్మారి బారీ నుంచి రక్షించేందుకు ప్రభుత్వం లాక్‌డౌన్ అమలు చేస్తోంది. ఈసమయంలో పేదలు ఇబ్బంది పడొద్దనే ముఖ్యమంతి కేసీఆర్ ఆలోచన మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన బాలింతలు, గర్భిణీలు, పిల్లలకు పాలు, గుడ్లు, బాలామృతం, నిత్యావసరాలను ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర గిరిజన, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరుకులు ఏ విధంగా పంపిణీ చేస్తున్నారన్నవిషయం పై శుక్రవారం మాసాబ్‌టాంక్ వద్ద ఎంజీ నగర్ అంగన్‌వాడి కేంద్రాన్ని మంత్రి సత్యవతి పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ నమోదైన బాలింతలు, గర్భిణీస్త్రీలు, పిల్లలకు సరుకులు, శానిటైజర్లు, మాస్క్‌లు కూడా పంపిణీ చేశారు. ప్రస్తుతం కరోనా కష్టకాలం నడుస్తోందని, ఈ సమయంలోనే మన అవసరం ప్రజలకు ఎక్కువగా ఉందని, వారికి ప్రభుత్వ సేవలన్నీ సకాలంలో అందించి ఆదుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పాలు, గుడ్లు, నూనె, పప్పు, బియ్యం, బాలామృతం, నిత్యావసరాలకు ఎలాంటి కొరత రాకుండా ఎప్పటికప్పుడు ప్రభుత్వం పర్యవేక్షణ చేస్తూ అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకుంటుందన్నారు. అదే విధంగా తమ సేవలను నిరాటంకంగా అందిస్తున్న అంగన్‌వాడీల స్వీయ రక్షణ కోసం శానిటైజర్లు, మాస్క్‌లు కూడా ఇప్పటికే అందించామని మంత్రి తెలిపారు. అంగన్‌వాడీలు బాగా పనిచేస్తున్నాయని అన్నారు. వీరి సేవలు బాగా ఉన్నాయని నీతి ఆయోగ్ కూడా ప్రశంసించిందన్నారు. లాక్‌డౌన్ అయిన వెంటనే అంగన్‌వాడీల ద్వారా మొదటి 12 రోజులకు సరిపడా సరుకులు అందించామని, ఇప్పుడు రెండో విడత సరుకులు అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అంగన్‌వాడీలంటే ఇష్టమని, అందుకే ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకున్నా వారి ఇబ్బందును గుర్తించి ఇంటికి పిలిచి వేతనాలు ఇవ్వడం, వారి వేతనాలు పెంచిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. అంగన్‌వాడీలు కూడ కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశుసంక్షేమశాఖ కమిషనర్ దివ్య, జిల్లా సంక్షేమాధికారి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు బూర నర్సయ్యగౌడ్, శ్రీనివాసరావ్ విరాళాల అందజేత

హైదరాబాద్, ఏప్రిల్ 10: కరోనాపై రాష్ట్రప్రభుత్వం చేస్తున్న పోరాటాని అండగా మేమున్నామంటూ అనేక సంస్థలు, వ్యక్తులు ముందుకు వస్తున్నారు. విరాళాలు అందిస్తూ తమ ధాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఇందులోభాగంగా భువనగిరి మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్ తన వంతు విరాళంగా రూ. 10 లక్షల చెక్కును రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు అందించారు. అదేవిధంగా ఎస్ఆర్ఐసీవో ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత మేచినేని శ్రీనివాసరావ్ రూ. 10 లక్షలు కేటీఆర్‌కు అందించారు.

కఠిన ఆంక్షలు అమలు చేస్తున్న మహారాష్ట్ర

మాస్కులు ధరించనందుకు కేసులు

పుణె,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి నివారణ చర్యల నేపథ్యంలో నిబంధనలు ఉల్లఘించిన వారిపై మహారాష్ట్ర ప్రభుత్వం కొరడా రుళిపిస్తోంది. లాక్‌డౌన్‌లో ఇంటి నుంచి బయటకు రాడమే కాకుండా, ముఖానికి మాస్క్ పెట్టుకోలేదన్న ఆరోపణలతో ఏడుగురిపై పుణె పోలీసులు కేసు నమోదు చేశారు. కుర్లీవాడీ ప్రాంతానికి చెందిన ఈ ఏడుగురు మాస్క్ లేకుండా బయట తిరుగుతుండటంతో పింప్రీ-వాద్ పోలీసులు ఈ మేరకు చర్య తీసుకున్నారు. ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు చేశారు. కోవిడ్-19 విస్తృతి నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో విధిగా ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) బుధవారం ఆదేశాలు జారీ చేసింది. మాస్క్ ధరించని వారిని అరెస్ట్ చేసేందుకు వెనుకాడమని బీఎంసీ అధికారులు హెచ్చరించారు. కాగా, దేశంలోని చాలా నగరాల్లో ఈ నిబంధన అమలు చేస్తున్నారు. ఢిల్లీ, ముంబైతో పాటు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలు కూడా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశాయి. జమ్మూకశ్మీర్‌లో కూడా ముఖానికి మాస్క్ ధరించడాన్ని తప్పనిసరి చేశారు. మాస్క్ లేకుండా బయటకు వస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

చరిత్రలో నేటినిజం

కు॥ నాతికి ప్రతిబంధకమై
యాడన పెట్టెడి 'త్రియిద్ద' నంబము జేయన
"జ్యోతిరావ్ ఫూలే"-వి
ఖ్యాతిని కడియించినాడు కార్పణ్యమునిగానే!!

(ఏప్రిల్ 11 జ్యోతీరావు ఫూ

నేటినిజం
శనివారం 11-4-2020

మానవాతీత శక్తి అంటే దైవమే..!

అనుభవం ఎదురవనంతవరకు మనం ఎన్ని విషయాలైనా, ఎన్ని పరిష్కారాలైనా ఎదుటివారికి చెప్పేస్తుంటాం! ఇక దైవం చూపే శక్తి గురించి ఎలా వర్ణించగలం? ఎలా నమ్మించగలం? దేవుడున్నాడు అనేది నీ పూర్తి నమ్మకం అయినపుడు ఆ నమ్మకాన్ని మరొకరికి ఎలా ఆపాదించగలం? మనసులో ఉన్నది మనిషైనా, దేవుడైనా జాగృతం చేసి అనుభవంలోకి తెచ్చుకున్న తర్వాతే ఎవరైనా నమ్మగలుగుతారు. మన సంకల్పాలు నెరవేరకుండా విఘ్నాలు కలుగుతున్నపుడు మానవాతీత శక్తి పనిచేసి మనల్ని మనతోనే నిత్యం నడిపించగలుగుతున్నపుడు ఎదురయ్యే అనుభవాలే జీవితం. ఎదురుచూడకుండా ఎదురయ్యే అనుభవాలే దైవం. ఏదయినా నమ్మి ఆచరించడంలోనే ఆనందం ఉంటుంది. నమ్మకం కలిగించుకోవడంలోనే సుఖసంతోషాలు ఉంటాయి, కష్టపడతాం. ఎదురుచూస్తాం. ఆశపడతాం. అయినా వీటన్నింటితోపాటు దైవశక్తి అనుకూలించాలి. జన్మించే ప్రతి కొత్త శిశువు ఇంకా సృష్టి నడుస్తుందనే విషయానికి నిదర్శనం. ఎవరూ అక్కర్లేదు. అసలు సృష్టే అక్కరలేదు అని దేవుడు అనుకుంటే చాలు ఈ విశ్వం ఆగిపోతుంది. ఎవరికోసం ఎవరు ఈ పనిచేస్తున్నారు? అని దేవుడిని అర్థం చేసుకునేవారు ఎంతమంది ఉన్నారు? దైవానుభవం కోసం అర్రులు చాచే వారు ఎంతమంది ఉన్నారు? అనుకుంటే మనం కాస్సేపు ఆలోచనలో పడిపోక తప్పదు. ప్రకృతిని చూస్తాం. ఆనందిస్తాం. అందమైన మనిషిని చూసినా అబ్బ! ఎంతటి సౌందర్యం కదా అనుకుంటాం.

కానీ అంత మన కళ్ళను కట్టిపడేసే అందం భగవంతుడు సృష్టే కదా? మన ఆ భావాల్లోకి విస్తరించినపుడు తోలుబొమ్మలుగానే మిగిలిపోతాం. ఆధునిక మహాయుగ యాంత్రికతలో పడి కొట్టుకుపోయి మానవ జీవన పరమార్థం మరచిపోతాం. అనుభవాలు సులువుగా రావు. ఎముకలు పుల్లలై పోవాలి.

అనుభవాలు అలవాటుగా రావు నాలుక తడారిపోవాలి. ఆశ కనుచూపు మేరలో లేకుండా పోవాలి. నిరంతరం తపస్సులా ధ్యానం చేయాలి. ఊపిరిలో ఊపిరిగా దైవాభావం ఉండిపోవాలి. ఈ మాటలు నిజమా కాదా అని ఒక్కసారి ఆలోచించండి! దేని కోసం మనం నిత్యం ఆరాటపడుతున్నాం? దేనిని మనం పూర్తిగా విస్మరిస్తున్నాం? తెలుస్తోందా? కడుపు నిండిన మహారాజులు ఎన్నైనా చెబుతారు అంటారా? చెప్పడానికి ఆకలేంటి? భారమేంటి? ఆలోచించండి! ఇందుకు మీకో ఉదాహరణ చెప్పాలి. ముక్కు మూసుకుని గులాబీపూల మధ్య తిరిగితే పరిమళం వస్తుందా? కళ్ళుమూసుకుని ఆకాశం వైపు చూస్తే కనిపిస్తుందా? చెవులు మూసుకుని ఉద్యానవనంలో తిరిగితే పక్షుల కిలకిలా రావాలు వినిపిస్తాయా? హృదయాన్ని బంధించి భగవన్నామస్మరణ అంటే తలకెక్కుతుందా? అంటే వీటిక్కూడా తర్కవితర్కాలు పనిచేస్తాయా? అంటే ఏమీ చేయలేము కానీ దేనికైనా తర్కం ఉండాలి. ఏమాత్రం నచ్చని వితర్కం ఉండితీరాలి. ప్రేమతో దివ్యమైన భావాలతో ఆరాధిస్తే, స్తుతిస్తే, ఆక్రోశిస్తే ఇక భగవంతుడు మన ముందుకుకాకుండా, మన ఆవేదనను తీర్చకుండా ఎలా ఉంటాడు? అనేది కూడా ఆలోచించండి..! మన రూపం మనకు కనిపిస్తుంది..!!

గన్నీ బ్యాగుల కొరత లేదు

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేవు: మంత్రి కొప్పుల

జగిత్యాల,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): తెలంగాణలో గన్నీ బ్యాగుల కొరత లేదని.. రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. రైతులు తమవద్ద బ్యాగులు ఉన్నా అప్పగించవచ్చన్నారు. లేకున్నా ప్రభుత్వం సమకూరుస్తోందని అన్నారు. తెలంగాణలో గన్నీ బ్యాగుల కొరత నెలకొందని.. వరి ధాన్యాన్ని తరలించేందుకు 20 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమని పౌర సరఫరాల శాఖ పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పందించారు. అందరూ లాక్‌డౌన్ నిబంధనలు పాటించాలని సంయమనం పాటిస్తే అందరం బయటపడతామని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రతి ధాన్యం గింజనూ కొంటామని, రైతులు నిర్దేశించిన తేదీల్లోనే ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని మంత్రి పేర్కొన్నారు. కరోనా నేపథ్యంలో ఊరికో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్రాల వద్దకు ధాన్యం, మక్కలు తెచ్చే రైతులు తప్పనిసరిగా సామాజిక దూరాన్ని పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కేంద్రం వద్ద శానిటైజర్లు, సబ్బులు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. వాటితో తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, కొనుగోళ్ల విషయంలో ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇదిలావుంటే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ధాన్యం, మక్కల కొనుగోళ్లు మొదలయ్యాయి.

కరోనా నివారణకు తిరుమలలో మరో యత్నం

యోగవాశిష్టం –శ్రీ ధన్వంతరి మహామంత్ర పారాయణం

వెల్లడించిన టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి

తిరుమల,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): లోకక్షేమాన్ని కాంక్షిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తూ 'యోగవాశిష్టం – శ్రీ ధన్వంతరి మహామంత్రం' పారాయణం చేస్తున్నామని టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ఆధ్వర్యంలో నాదనీరాజనం వేదికపై శుక్రవారం ఉదయం 7 గంటలకు 'యోగవాశిష్టం – శ్రీ ధన్వంతరి మహామంత్రం' పారాయణం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిటిడి ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ కరోనా వ్యాధి వ్యాప్తి అరికట్టాలని స్వామివారిని కోరుకుంటూ గత 20 రోజుల నుండి తిరుమలలో పలు వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా మార్చి 16 నుండి 25వ తేదీ వరకు శ్రీనివాస వేదమంత్ర ఆరోగ్య జపయజ్ఞం, మార్చి 26 నుండి 28వ తేదీ వరకు శ్రీ శ్రీనివాస శాంత్యోత్సవ సహిత ధన్వంతరి మహాయాగం నిర్వహించామని వివరించారు. 'యోగవాశిష్టం – శ్రీ ధన్వంతరి మహామంత్రం' పారాయణాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని, తద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు ఈ వేదమంత్రాలను పఠించి ఉపశమనం పొందవచ్చని అన్నారు.

ఈ కార్యక్రమం ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు మొదలై 45 నిమిషాల పాటు కొనసాగుతుందని తెలిపారు. ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కెవిఎస్.అవధాని మాట్లాడుతూ శ్రీ వాల్మీకి మహర్షి రచించిన రామాయణం గ్రంథంలోని యోగవాశిష్టంలో శ్రీరామ, వశిష్ఠ సంవాదరూపమైన ఉత్పత్తి ప్రకరణంలో 69వ సర్గలో విషూచికా(సూక్ష్మక్రిమి) నివారణ మంత్రం ఉందన్నారు. ఈ మంత్రంతోపాటు శృంగేరి జగద్గురువులు లోకానికి అందించిన శ్రీ దుర్గాపరమేశ్వరి స్తోత్రం, మానవాళికి ఆరోగ్యాన్ని ప్రసాదించి శ్రీ ధన్వంతరి స్వామిని ప్రార్థిస్తూ శ్రీ ధన్వంతరి మహామంత్రాన్ని పారాయణం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిఎస్.అవధాని ఆధ్వర్యంలో వేదపండితులు ముందుగా కరోనా వ్యాధి వ్యాప్తి నివారణ కోసం సంకల్పం చెప్పించారు. మొదటగా యోగవాశిష్టంలోని విషూచికా(సూక్ష్మక్రిమి) నివారణ మంత్రాన్ని పఠించారు. ఆనంతరం శ్రీదుర్గాపరమేశ్వరి స్తోత్రంలోని 5 శ్లోకాలను 3సార్లు, ధన్వంతరి మహామంత్రాన్ని 21 సార్లు పారాయణం చేశారు. చివరిగా ధన్వంతరి గాయత్రి మంత్రం, శ్రీవారి ధ్యానంతో ఈ కార్యక్రమం ముగిసింది. వేదపండితులు పారాయణం చేస్తుండగా అధికారులు, ప్రత్యక్షప్రసారంలో టివి సెట్ల ద్వారా భక్తులు వారిని అనుసరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవో పి.బసంత్‌కుమార్, సివిఎస్వో గోపినాథ్‌జెట్టి, శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, విఎస్వో మనోహర్, ఎస్ఇలు నాగేశ్వరరావు, శ్రీ వేంకటేశ్వర్లు, ఆరోగ్యశాఖాధికారి డా. ఆర్ఆర్.రెడ్డి, డెప్యూటీ ఈవోలు విజయసారథి, బాలాజి, నాగరాజ, దామోదరం ఇతర అధికారులు పాల్గొన్నారు.

కరోనాపై ఉమ్మడిగా పోరాడుదాం: భారత్, నేపాల్ ప్రధానుల అంగీకారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ప్రపంచ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కరోనా మహమ్మారిపై ఉమ్మడిగా పోరాటం చేసేందుకు భారత్, నేపాల్ ప్రధానుల మధ్య అంగీకారం కుదిరింది. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీ, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి శుక్రవారం టెలీఫోన్‌లో మాట్లాడుకుని అంగీకారం చేసుకున్నారు. ఈ రోజు తాను నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలితో మాట్లాడానని, కరోనావల్ల తలెత్తుతున్న పరిస్థితిపై చర్చలు జరిపామని, కొవిడ్–19 కట్టడికి సమిష్టిగా పోరాడుదామని ఈ సందర్భంగా నిర్ణయించుకున్నామని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

ప్రధాని మోదీ ట్వీట్ చేసిన కొద్ది నిమిషాలకే నేపాల్ ప్రధాని ఓలి ట్విటర్లో స్పందించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో తాను ఇవాళ ఫోన్‌లో మాట్లాడానని, కరోనా వైరస్‌పై మరింత నిబద్ధతో పోరాడాలని ఈ సందర్భంగా పరస్పరం అంగీకరించామని, ప్రస్తుతం కొనసాగుతున్న లాక్‌డౌన్ వల్ల ఇరువైపులా చిక్కుకున్న తమ పౌరులను క్షేమంగా చూసుకోవాలని నిర్ణయించుకున్నామని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో గత నెల 25 నుంచి లాక్‌డౌన్ కొనసాగుతుండగా, నేపాల్‌లో అంతకంటే ఒకరోజు ముందు నుంచే లాక్‌డౌన్ అమల్లోకి వచ్చింది.

కరోనాపై యుద్ధంలో వారే అసలు సైనికులు!

హైదరాబాద్, ఏప్రిల్ 10:కరోనాపై పోరాడుతూ ప్రజలను కాపాడుతున్న వైద్యులు, వైద్య సిబ్బందిపై జరుగుతన్న దాడులపై కఠిన హెచ్చరికలు చేస్తున్న ప్రభుత్వం...దాడులకు పాల్పడ్డవారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనపడడం లేదు. దాడులను ఉపేక్షించమని చెబుతున్నా అక్కడక్కడా చికిత్స చేస్తున్న డాక్టర్లపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. అలాగే సర్వే కోసం వెళుతున్న ఆశావర్కర్లపైనా దాడులు జరుగుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో అధికార టిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలరే ఇటీవల దాడికి పూనుకున్నాడు. ఇలాంటి వారిపై ఏ చర్యలు తీసుకున్నారో ప్రజలకు తెలియచేయాలి. అలాగే దాడులు చేస్తున్న వారికి, వారి బంధువులకు వైద్యం నిరాకరించాలి. వారిని ఆస్పత్రుల్లో కాకుండా జైళ్లకు తరలించాలి. అప్పుడే తిక్క కుదురుతుంది. ప్రాణాలకు తెగించి, భార్యా పిల్లలను వదిలేసి, నిద్రాహారాలు మానేసి చికిత్స చేస్తున్న వైద్య నారాయణులపై దాడులు ఏ మాత్రం సహేతుకం కాదు. ప్రస్తుతం కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో వైద్యులతో పాటు నర్సులు, ఆశావర్కర్లు, ఇతర వైద్య సిబ్బందిదే కీలక పాత్ర. తమ ప్రాణాలను పణంగా పెట్టి, కరోనాతో యుద్ధం చేస్తున్నారు. ఈ యుద్ధంలో ఎవరైనా వైద్య సిబ్బంది ప్రాణాలు పోగొట్టుకుంటే, వారికి కోటి రూపాయలు ఇస్తామని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించడం... వీరి సేవలకిచ్చిన ఒక గౌరవమే తప్ప వెలకట్టడం ఎంతమాత్రమూ కాదు. ముఖ్యంగా ఈ యుద్ధంలో ప్రముఖ పాత్ర నర్సులది. కరోనా రక్కసి ఒకవైపు భయపెడుతున్నా.. ముఖానికి పెట్టుకున్న మాస్క్ జారి పోతుందనో, కళ్లద్దాలు కళ్లను సరిగా కవర్ చేస్తున్నాయో లేదోననో, చేతికున్న గ్లౌజులు సరిగా వున్నాయో లేదో అనే భయం వెంటాడుతున్నా, ఏక ధాటిగా కనీసం మంచినీళ్లు కూడా తాగకుండా, వాష్‌రూమ్‌లకు సైతం వెళ్లకుండా, శారీరకంగా, మానసికంగా అలసిపోతున్నా... ఒక లక్ష్యంతో, దీక్షతో కరోనా రోగులను కాపాడేందుకు పోరాడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా బాధితులకు సేవలందించడంలో కేరళ నర్సులు ముందు వరుసలో వున్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిక ప్రకారం... ప్రపంచ వ్యాప్తంగా కేరళ నర్సులే ఎక్కువ మంది సేవలంది స్తున్నారు. ఒకవైపు క్యూబా తమ వైద్య బృందాలతో దాదాపు అన్ని దేశాలకూ సేవలందిస్తోంది. మరోవైపు కేరళ నర్సులు కూడా అదే స్ఫూర్తితో సేవలందిస్తున్నారు. ఒక్క అమెరికా, బ్రిటన్ లలోనే 30 శాతం మంది కేరళ నర్సులు తమ సేవలందిస్తున్నారు. కరోనాతో యుద్ధం చేస్తోన్న ప్రపంచానికి కేరళ నర్సులు ఇప్పుడు దేవతామూర్తులుగా కనిపిస్తున్నారు. ప్రస్తుతం మానవాళిని వేధిస్తున్న అనేక ఆరోగ్య సమస్యలతో పాటు రోజుకో కొత్త వైరస్ పుట్టుకొచ్చి, మానవాళిని ముప్పుతిప్పలు పెడుతోంది. వీటికి మానవ తప్పిదాలే చాలా వరకు కారణం. ఎవరైనా దగ్గినా తుమ్మినా దూరంగా జరిగే రోజులివి. అలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ సైనికుల్లా ధైర్యంగా నిలబడి, తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి సేవలందించే మహనీయులు వైద్యులు, నర్సులు. రోగులకు డాక్టర్లు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో, నర్సులు చేసే సేవలు కూడా అంతే ముఖ్యం.

చెరగని చిరునవ్వు, ఆప్యాయమైన పలకరింపులతో రొగులకు స్వాంతన కల్పిస్తున్నారు. ఇక గ్రామాల్లో కనిపించే ఆశావర్కర్లు సైతం రోగులకు కొండంత ఆసరా. ఎంతటి బాధలో వున్నవారికైనా ఓదార్పునిస్తూ తమ సేవలను అందిస్తున్నారు. వారి సేవాతత్పరత సగం రోగాన్ని అప్పుడే తగ్గిస్తుంది. ఆసుప్రతులకు వెళ్లక తప్పని నేటి రోజుల్లో... పుట్టిన బిడ్డకు తొలిస్పర్శ ఆమెదే, చనిపోయే ముందు చివరిచూపూ ఆమెదే. పుట్టిన దగ్గర నుంచి చనిపోయేంతవరకు ఏదోక సమయంలో ఆమె స్పర్శ లేకుండా, ఆమె సేవలు పొందకుండా మన జీవనం సాగదన్నది అతిశయోక్తి కాదు. రకరకాల జబ్బులతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు ముందుగా మనోధైర్యాన్ని అందించేది, వారిని ఆరోగ్యవంతులను చేయడంలో కీలకపాత్ర వహించేది నర్సులే. ఎందు కంటే డాక్టర్ల కంటే రోగులతో ఎక్కువ సమయాన్ని గడిపేది వారే. ఇకపోతే ప్రజలు లాక్‌డౌన్‌ను ఆషామాషీ గా తీసుకుంటున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. వందలాదిగా వహనాలు వేసుకుని రోడ్లపైకి వస్తున్న వారి పైనా కఠిన చర్యలు తీసుకుంటే తప్ప వారు రోడ్డెక్కరు. మరో వారం పదిరోజులు లాక్‌డౌన్ పొడిగిస్తారని భావిస్తున్న తరుణంలో ప్రజలు కట్టుతప్పకుండా క్రమశిక్షణ పాటించాలి. వారు విచ్చలవిడిగా రోడ్లపైకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. పోలీసులు, పారిశుధ్య సిబ్బంది నిరంతరంగా మనకోసం కష్టపడితే మనం వారి శ్రమను నీరుగారుస్తున్నాం. ఆరోగ్యం కాపాడుకోవడమనేది అంత తేలికైన విషయమేమీ కాదు. వైద్య చికిత్సలకు లొంగని కరోనాను తుదముట్టించాలంటే లాక్‌డౌన్ పాటించడమే మార్గం. నగరీకరణ, కాలుష్యం, పర్యావరణ విధ్వంసం, కల్తీలు వంటి అనేక ఒత్తిడులతోపాటు కార్పొరేటీకరణ తెచ్చిన ప్రమాదం, ప్రకృతి వనరులదోపిడీ మనిషి అనారోగ్యానికి కారణమౌతున్నాయి. ఆధునిక పోకడలు పెరిగి పోతున్న కొద్దీ మనిషి శరీరంలో రోగనిరోధక శక్తి రోజురోజుకు తగ్గుతోంది. అందుకే ఇప్పుడు కరోనాను జయించాలంటే రోగనిరోధక శక్తిం పెంచుకోవాలని నిపుణులు పదేపదే సూచిస్తున్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలకు గాని, బిడ్డలు తమ తల్లిదండ్రులకు గాని సేవలు చేయాలేని పరిస్థితులు ఇప్పుడు దాపురించాయి. ఎవరి ఆరోగ్యాన్ని వారే కాపాడుకోవాలి. ఇంటికే పరిమితం అయి ఎవరికి వారు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. అలాగే ఒక తపస్సులా సేవలందిస్తోన్న వైద్యులు, నర్సులు, ఆశా వర్కర్లు, పారామెడికల్ సిబ్బందికి మద్దతుగా నిలవడం మన విద్యుక్త ధర్మం. వారిపై దాడులు చేసే వారిని మనుషులగా గుర్తించకుండా రాక్షసులుగా చూసి సమాజం నుంచి వెలివేయాలి.

ఎన్నారైల యోగక్షేమాలపై ఆందోళన

అమెరికాలో కరోనా విస్తృతితో భారతీయుల్లో భయం

వాషింగ్టన్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని కుదిపేస్తున్న కరోనా మహమ్మారి అగ్రరాజ్యం అమెరికాకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. అలాగే మనదేశంలోపనూ అమెరికాలో వ్యాధి వ్యాప్తి పట్ల ఆందోళన కలుగుతోంది. మనదేశం నుంచి వివిధ రంగాల్లో లక్షల సంఖ్యలో భారీతీయులు అక్కడ నివసిస్తున్నారు. అలాగే ప్రపంచంలోని అనేక దేశాల్లో స్థిరపడ్డారు. కరోనా కారణంగా వారు ఎక్కడికక్కడే ఉండిపోయారు. యూరప్ దేశాల్లో అనేకమంది భారతీయులు వివిధ రంగాల్లో ఉన్నారు. వారంతా ఎలా ఉన్నారన్న సమాచరంపై ప్రతిరోజూ చర్చ సాగుతోంది. అమెరికా,జర్మనీ, ఫ్రాన్స్, గల్ఫ్ దేశాల్లో మన వారు ఎక్కువగా ఉన్నారు. అయితే అక్కడి ఎన్నారై సంఘాలు భరోసా ఇస్తున్నా, తాజాగా అమెరికాలో పదిమంది ఎన్నారైలు మరణించారన్న వార్త ఇక్కడి వారిని కలచివేస్తోంది. ఇకపోతే అమెరికాలో లాక్‌డౌన్ నక్రమంగా అమలు చేయకపోవడంతో కరోనా వ్యాప్తి పెరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రంప్ ప్రభుత్వ నిర్వాకం ఫలితంగా కరోనా మృతుల సంఖ్యలో స్పెయిన్‌ను దాటి ప్రపంచంలో రెండో స్థానానికి ఎగబాకింది. అమెరికాలో కరోనా మృతుల సంఖ్య 15వేలు దాటగా పాజిటివ్ కేసుల సంఖ్య 5లక్షలు దాటిపోయాయి. కరోనా మరణాలతో అగ్ర స్థానంలో ఉన్న ఇటలీని కూడా అది త్వరలోనే దాటిపోవచ్చని నిపుణుల అంచనా.

మరో వైపు ప్రపంచవ్యాపితంగా కరోనా కేసుల సంఖ్య 15 లక్షలు దాటింది. కరోనా మహమ్మారికి కేంద్ర స్థానంగా మారిన అమెరికాకుమంగళ, బుధవారాలు పీడకలగా మారాయి. బుధవారం ఒక్క రోజే 1922 కరోనా మృతులు అమెరికాలో చోటు చేసుకున్నాయి. అంతకుముందు రోజు 1858 మరణాలు సంభవించాయి. న్యూయార్క్‌లో పరిస్థితి మరీ దారుణం. గడచిన 24 గంటల్లో ఆ రాష్ట్రంలో 779 మంది చనిపోయారు. ఆసుపత్రుల్లో సంభవించిన మరణాలే రికార్డు అవుతున్నాయి. ఇంటి దగ్గర చనిపోయినవారి వివరాలు లెక్కల్లోకి రావడం లేదు. అవి కూడా జోడిస్తే అమెరికాలో కరోనా మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఈ ధోరణి ఇలాగా కొనసాగితే అమెరికాలో కరోనా వైరస్ వల్ల చనిపోయేవారి సంఖ్య 90వేలు దాటిపోవచ్చని వైట్ హౌస్ కరోనా వైరస్ రెస్పాన్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ దేవ్‌రా బ్రిక్స్ చెప్పారు. ట్రంప్ మాత్రం వ్యాపార కార్యకలాపాలను యథావిధిగా కొనసాగించాలని కోరుతున్నారు. ఆహార, వ్యవసాయ, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, రవాణా, ఇంధనం, ప్రభుత్వ వసతులు వంటి రంగాల్లో వర్కర్స్ ఎప్పటిలాగే విధులు నిర్వహించాలంటున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే నిరుద్యోగం కనివిని ఎరుగని రీతిలో విజృంభిస్తుండడం అమెరికాను మరింత కలవరపరుస్తోంది. గత వారం రోజుల్లో 66 లక్షల మంది కొత్తగా అమెరికా నిరుద్యోగ సైన్యంలో చేరారు. తాజాగా కోటిన్నరమంది భృతి కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అంచనా. అంతకుముందు రెండు వారాల్లో కోటి మంది చేరిన సంగతి తెలిసిందే. అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందనడానికి ఉగ్రరూపం దాల్చుతున్న నిరుద్యోగ సమస్య ఒక సంకేతం అని ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ మూడవ రోజూ ఐసియులోనే ఉన్నారు. ఆయన ఆరోగ్యపరిస్థితి మెరుగుపడుతున్నట్లు వైద్యులు తెలిపారు.

ఆహార ఉత్పత్తి కేంద్రాల వద్ద కార్మికుల కొరత

పాక్షిక సడలింపు కోసం ఆయా సంస్థల ఎదురుచూపు

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): ఫ్యాక్టరీలలో కార్మికుల కొరత, సరుకుల రవాణా వాహనాల లభ్యత ప్రధాన సవాళ్లుగా మారాయి. లాక్‌డౌన్‌తో నిత్యావసర సరుకులకు రవాణా భారంగా మారింది. అలాగే కార్మికుల కొరత కూడా వేధిస్తోంది. హెచ్‌యూఎల్, ఐటీసీ, డాబర్ ఇండియా, పార్లే, జీసీపీఎల్, జ్యోతి ల్యాబ్స్ వంటి ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీలు తెలిపాయి. వచ్చే 2,3 వారాల పాటు సరిపడే నిత్యావసరాల నిల్వ ఉందని, ఆ తర్వాత తయారీ ప్లాంట్ల కార్యకలాపాలకు, ఆయా ఉత్పత్తుల సరఫరా వాహన అనుమతులకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నాయి. 'లాక్‌డౌన్ నేపథ్యంలో కొన్ని ప్లాంట్ల ఉత్పత్తి మీద ప్రభావం పడింది. అయినా ఇతరత్రా మార్గాల ద్వారా రోజువారీ అవసరాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సాధ్యమైనంత చర్యలు తీసుకుంటున్నాయి. ముడిసరుకుల వాహనాలు, ప్యాకేజింగ్ మెటీరియల్స్ సప్లయి ఆగిందని ఆయా సంస్థల నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రభుత్వం అనుమతితో కొద్ది మంది కార్మికులతో నిత్యావసర సరుకుల తయారీ ప్లాంట్లలో మాత్రం ఉత్పత్తి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పూర్తి స్థాయి అనుమతులకు మరికొంత సమయం పట్టే సూచనలున్నాయి. లాక్‌డౌన్ ఎత్తేసినా ఉత్పత్తి రంగాలకు కార్మికులకు అనుమతిస్తారా అన్నది అనుమానమే. ఉత్పత్తులకు కొరత రాకుండా ప్రభుత్వ అనుమతులతో 50 శాతం? కార్మికులు, షిఫ్ట్‌ల వారీగా ప్లాంట్ నిర్వహణ చేస్తున్నామని కొన్ని సంస్థలు తెలిపాయి. లాక్‌డౌన్‌తో డ్రైవర్ల కొరతతోపాటూ లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కార్మికుల కొరత ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ నేపథ్యంలో వినియోగదారులు నిత్యావసర వస్తువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అంటున్నారు. విక్రేతల వద్ద సరిపడ నిల్వ ఉందని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) తెలిపింది. అయితే లాక్‌డౌన్ నేపథ్యంలో సరుకుల సరఫరా మీద ప్రభావం ఉందని తెలిపారు. ప్రస్తుతం స్టోర్లలో నిత్యావసరాల పూర్తి స్థాయి స్టాక్ ఉంది. కొన్ని రకాల బ్రాండ్ల తయారీ సంస్థలతో మాట్లాడుతున్నామని, త్వరలోనే అవి కూడా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని స్టోర్టలోనూ సరుకుల కొరత లేదని, వినియోగదారులు కొనుగోలు మీద నియంత్రణ పెట్టామని తెలిపారు. ఉబెర్ ,బిగ్‌బాస్కెట్‌తో ఈ మేరకు చేతులు కలిపింది. హైదరాబాద్ సహా బెంగళూరు, చండీగఢ్, నోయిడాలో ఈ సేవలను అందించనుంది. ద్విచక్ర వాహనాలు , కార్ల ద్వారా సరుకులను వినియోగదార్ల ఇంటికే చేరవేస్తామని ఉబెర్ తెలిపింది. ఇటువంటి సేవల కోసం ఇతర సూపర్ మార్కెట్లు, ఫార్మానీలతోనూ చర్చిస్తున్నట్టు వివరించింది.

సోనూసూద్ పెద్ద మనసు

ఉచితంగా తన హోటల్‌లో ఉండొచ్చని ఆఫర్

ముంబై,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): విలనిజంతో ఆకట్టుకున్న నటుడు సోనూసూద్ తెలుగుసినీ ప్రేక్షకులకు సుపరిచితమే. కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో తన వంతుగా వైద్యసిబ్బందికి సాయం చేసేందుకు ముందుకొచ్చాడు. ముంబైలోని జుహూ ప్రాంతంలో సోనూసూద్‌కు ఆరంతస్తుల హోటల్ వుంది.

కరోనా వైరస్ రోగులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బందికి ముంబైలోని తన హోటల్‌ల్లో ఉండొచ్చని ప్రకటించాడు.

ఈ విషయాన్ని ఇప్పటికే ముంబై మున్సిపల్ అధికారులు, ప్రైవేట్ ఆసుపత్రుల దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించాడు. కరోనాపై పోరాడుతున్న వారికి సాయం చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు సోనూసూద్ తెలిపాడు. 'ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రోజంతా శ్రమిస్తున్న వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందికి చిన్న సాయం చేసే అవకాశాన్ని గౌరవంగా భావిస్తున్నా. వాళ్లంతా ముంబైలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సేవ చేస్తున్నారు. వాళ్లు విశ్రాంతి తీసుకునేందుకు ఒక చోటు కావాలి. అందుకు మా హోటల్‌ను వినియోగించుకోవాలని మున్సిపల్, ప్రైవేట్ ఆసుపత్రులకు తెలిపాం' అని సోనూసూద్ పేర్కొన్నాడు.

ఎర్రబెల్లికి విరాళం మొత్తం అందచేత

వరంగల్ రూరల్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా విపత్తులో ఆర్థిక లోటుని సైతం అదిగమిస్తూ, ప్రజలకు నిరంతరంగా సేవలు అందిస్తున్న ప్రభుత్వాలకు మేమున్నామంటూ అండగా అనేక మంది వ్యక్తులు, సంస్థలు ముందుకు వస్తున్నాయి. విరాళాలు అందిస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నాయి. తాజాగా స్పైసెస్ రంగంలో పేరున్న కరానీ గ్రూపు రూ.5.62 లక్షల విరాళాన్ని ప్రకటించింది. ఇందులో సీఎం సహాయ నిధికి రూ. 2.11 లక్షలు, పీఎం కేర్స్ ఫండ్ కి రూ.3.51లక్షల విరాళాన్ని అందించింది. ఈ మెత్తాన్ని రెండు వేర్వేరు

ఏపీలో కరోనా కట్టడికి కఠిన ఆంక్షలు

అమరావతి,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): ఎపిలో కరోనా కట్టడికి కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. తబ్లిగి వారితో వచ్చిన కరోనా కారణంగా రోజురోజుకు కేసుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఎక్కడికక్కడ జిల్లాల్లో కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. అలాగే సిఎం వైఎస్ జగన్ నిత్యం సమీక్షలు చేస్తూ అధికార యంత్రాంగానికి సూచనలు చేస్తున్నారు. పలుజిల్లాల్లో కఠిన ఆంక్షలు కొనసాగిస్తున్నారు. రెడ్‌జోన్ల పరిధిలో జిల్లాల వారీగా కరోనా హాట్‌స్పాట్లను ఇప్పటికే గుర్తించి, పోలీస్ శాఖ సహాయంతో ఆ ప్రాంతాల్లో కఠిన ఆంక్షలు అమలు చేస్తోంది. 14వ తేది తరువాతకూడా ఆ ప్రాంతాల్లో కఠినంగా లాక్‌డౌన్ నిబంధనలు అమలయ్యేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. రెడ్‌జోన్లలో ఇంటింటి సర్వే చేయించడం ద్వారా అనుమానం ఉన్న వారిని విచారించి వారిని క్వారంటైన్‌కు తరలించడానికి కూడా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రాధాన్యత ఇస్తోంది. లాక్‌డౌన్ సడలించినా వీరు బయటకు రాకుండా చూడటానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటి వరకూ రెండు విడతలుగా 1.46 కోట్ల కుటుంబాలను తనిఖీ చేసినట్లు అధికారులు ప్రకటించారు. మూడదోశ సర్వే ప్రస్తుతం జరుగుతోంది. కుటుంబంలోని ప్రతి ఒక్క సభ్యుడి ఆరోగ్యపరిస్థితిని నమోదు చేయాలని, సమగ్రంగా సర్వే జరపాలని ఆదేశించారు. మొదటి రెండు సర్వేల్లో దగ్గు, జలుబు, గొంతునొప్పి, జ్వరం లాంటి లక్షణాలతో గుర్తించిన 6,289 మందికూడా మూడో సర్వేలో భాగంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మెడికల్ ఆఫీసర్ నిర్ధారించిన వారినే కాకుండా, వైరస్ లక్షణాలు ఉన్నట్లుగా గుర్తించిన వారందరికీ కూడా పరీక్షలు చేయించాలని ఆదేశించారు. భారతీయ వైద్య పరిశోధనా మండలి మార్గదర్శకాల ప్రకారం మరో రెండు కేటగిరీలను చేర్చి, అదనపు ప్రశ్నలను సర్వేలో జోడించినట్లు తెలిపారు.ఇకపోతే లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 14 తరువాత ఎలా అమలు చేయాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. కేంద్రం లాక్‌డౌన్ ఎత్తివేస్తే ఏం చేయాలి? పాక్షికంగా సడలిస్తే ఎటువంటి చర్యలు తీసుకోవాలి? సడలింపు లేకుండా పూర్తిస్థాయిలో కొనసాగిస్తే ఎలా వ్యవహరించాలన్న అంశాలను పరిగణలోకి తీసుకుని సర్కారు కసరత్తు చేస్తోంది. కొన్ని పరిమితులకు లోబడి లాక్‌డౌన్‌ను ఎత్తివేసే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీని ఆధారంగా ఇప్పటికే కార్యాచరణ రూపొందించిన ప్రభుత్వం ఆ దిశలో చర్యలు సైతం మొదలుపెట్టింది. రెడ్‌జోన్లు, హాట్‌స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో పూర్తిగా కర్ఫ్యూ వాతావరణాన్ని కొనసాగిస్తూ మిగిలిన ప్రాంతాల్లో దశాల వారిగా సాధారణ కార్యక్రమాలను కొనసాగించడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది.కార్యాచరణలో భాగంగా హాట్‌స్పాట్లను గుర్తించడానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇచ్చింది. కరోనా వైరస్ ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోందని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కాటంనేని భాస్కర్ తెలిపారు. వైరస్ బారిన పడిన వారిని గుర్తించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక సర్వే చేపట్టామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.46 కోట్ల కుటుంబాలు ఉన్నాయని... ఇప్పటి వరకు రెండు దఫాలుగా సర్వే చేశామని వెల్లడించారు. 1.46 కోట్ల గృహాలను సర్వైవలెన్స్ పద్ధతిలో సర్వే చేశామని వివరించారు.

ఇప్పటివరకు 1.32 కోట్ల కుటుంబాలను రెండు సార్లు సర్వే చేశామని చెప్పారు. ప్రస్తుతం మూడో దశలో సర్వే కొనసాగుతోందన్నారు. ఇప్పుడు సర్వే అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. కరోనా లక్షణాలు ఉంటే 14 రోజుల క్వారంటైన్‌కు రికమండ్ చేస్తారని.. కరోనా పాజిటివ్ వస్తే కోవిడ్ ఆస్పత్రికి పంపిస్తారని తెలిపారు. మూడో దశలో ఇప్పటివరకు 12,311 మంది అనుమానితులను గుర్తించి.. 1754 మందిని గృహనిర్బంధంలో ఉంచామని పేర్కొన్నారు. కరోనా నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కాటంనేని భాస్కర్ తెలిపారు. ఇకపోతే వ్యవసాయరంగం కుటుంపడకుండా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గత రెండు రోజులుగా ప్రభుత్వం విడుదల చేస్తున్న వ్యవసాయ అనుబంధం జిఓలు ఈ దిశలోనే ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే వ్యవసాయ సాగుకు అవకాశాలు కల్పించిన ప్రభుత్వం దానిలో భౌతికదూరం పాటించాలని ఆదేశించింది. ఈ బాధ్యతను ఎక్స్‌టెన్షన్ అధికారులకు అప్పగించింది. ఇప్పటి నుండే వ్యవసాయ కార్యాచరణ మొదలుపెడితే లాక్‌డౌన్ ఎత్తేసే నాటికి వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యాన పంటలు అందుబాటులో వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. దీనికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రైతులు నష్టపోకుండా అదనపు రైతుబజార్లు పెట్టించింది. లాక్‌డౌన్ అమలు చేసినా నిబంధనల మేరకు వ్యవసాయం కొనసాగేలా చేయనున్నారు.

చంద్రబాబుకు రాజకీయ వైరస్

కరోనా వేళ నీచరాజకీయాలు

మండిపడ్డ మంత్రి ఆదిమూలపు సురేశ్

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): చంద్రబాబు ప్రతి విషయాన్ని రాజకీయం చేస్తున్నారు. కరోనాపై కాకుండా మా ప్రభుత్వంపై, మాపై పోరాటం చేస్తున్నారు అని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రపంచానికి కోవిడ్ సోకితే బాబుకు నీచ రాజకీయ వైరస్ సోకిందని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన హైదరాబాద్‌లోని లేక్ వ్యూ గెస్ట్ హౌస్ నుంచి మాట్లాడుతూ.. కోవిడ్-19 నియంత్రణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటుంటే మాస్కులు, కిట్లు లేవని నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ డాక్టర్ వికటించడంతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. లోకేష్, అయ్యన్నపాత్రుడు డైరెక్షన్‌లో డాక్టర్ సుధాకర్ కూడా ఎన్ 95 మాస్కులు లేవంటూ అసత్య ప్రచారానికి దిగాడని మండిపడ్డారు. ఒక డాక్టర్ అయి ఉండి, ఇలాంటి దురాలోచన ఎందుకు వచ్చిందో తెలియట్లేదని ఆదిమూలపు సురేష్ అన్నారు. ఈ ఆపత్కాలంలో డాక్టర్ల సేవలను కొనియాడాల్సింది పోయి ఒక వైద్యుడిగా ఇలా నిందలు వేయడం సరికాదని హితవు పలికారు. పీపీఈ కిట్లు, ఔ95 మాస్కుల కొరత లేదని స్పష్టం చేశారు. ఔ95 మాస్కులు 20 నుంచి 25 రోజులపాటు వాడవచ్చని ప్రోటోకాల్ చెప్తోందన్న విషయాన్ని ప్రస్తావించారు. కరోనా వ్యతిరేక పోరాటం కోసం రూ.3000 కోట్ల నిధులు విడుదల చేశామని, రూ.1000, బియ్యం, చక్కెర ఉచితంగా పేదలకు ఇస్తున్నామన్నారు. దేశంలోనే మెచ్చుకునే విధంగా గ్రామ వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

స్వీయ నిర్బంధంతోనే కరానోపై విజయం సాధిస్తాం

ఛాతీ ఆస్పత్రి వైద్యనిపుణులు డాక్టర్ మహబూబ్‌ఖాన్

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ పై విజయం సాధించాలంటే స్వీయ నిర్బంధంలోనే ఉండాలని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి వైద్యనిపుణులు డాక్టర్ మహబూబ్‌ఖాన్ అన్నారు. కరోనా వైరస్ కట్టడికి వైద్యులు, పోలీసులు, మున్సిపల్ సిబ్బంది, మీడియా శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారని దీనికి ప్రజలందరూ సహకరించాలన్నారు.గురువారం సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో కరోనా వైరస్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత కరోనా వైరస్ విదేశాల నుంచి వచ్చిన వ్యక్తుల నుంచి మాత్రమే వచ్చిందని, ప్రస్తుతం వైరస్ వ్యాప్తి నియంత్రణలోనే ఉందన్నారు. రాష్ట్రంలో యువత ఎవరూ కరోనా బారిన పడలేదని, కేవలం వృద్ధులు మాత్రమే మరణించారని తెలిపారు. ప్లాస్మా ద్వారా చికిత్స చేయడానికి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపామన్నారు. గాంధీ, సరోజిని, చెస్ట్ హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్టు డాక్టర్ మహబూబ్‌ఖాన్‌తెలిపారు. ఈ సమయంలో వృద్ధులు, చిన్నపిల్లలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. కరోనా వైరస్ పై అనుమానం ఉంటే ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని నిర్భయంగా డాక్టర్లను సంప్రదించాలన్నారు. కరోనా వైరస్ నివారణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నదని అభిప్రాయపడ్డారు. ప్రజలందరూ ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను పాటించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ భయాందోళనలకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే కరోనా రహిత భారత్‌ను ప్రపంచానికి చూపవచ్చన్నారు. ముఖ్యంగా వాట్సప్, ఫేస్‌బుక్, ఇతర సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలను ప్రజలు నమ్మవద్దన్నారు. చేతిని కళ్లకు, ముక్కు, నోటికి దూరంగా ఉంచితే కరోనా సోకకుండా చూసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో పౌరసంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ నాగయ్యకాంబ్లే, జాయింట్ డైరెక్టర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక దూరమే కరోనాకు మందు

లాక్‌డౌనే దానికి తగని శాస్తి

కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్

న్యూఢిల్లీ,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనాను ఎదుర్కోవాలంటే సామాజిక దూరం, లాక్‌డౌన్ రెండే రెండు అత్యంత శక్తివంతమైన సామాజిక టీకాలని కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి డా. హర్షవర్ధన్ గురువారం ప్రకటించారు. బెన్నెట్ట అంతర్జాతీయ యూనివర్శిటీ నిర్వహించిన గ్లోబల్ ఆన్‌లైన్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అయితే కరోనా విరుగుడుకు ఎలాంటి ఔషదాలూ లేవని, ఈ రెండే శక్తివంతమైనవని స్పష్టం చేశారు. ఐసోలేషన్ పద్ధతులతో పాటు ప్రభుత్వం చేస్తున్న సూచనలను దేశ ప్రజలు కచ్చితంగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కరోనా కేసుల విషయంలో ఇతర దేశాలతో పోలిస్తే మన దేశం చాలా మెరుగైన స్థితిలోనే ఉందని డా. హర్షవర్ధన్ తెలిపారు. ఇదిలావుంటే ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా లాక్‌డౌన్‌ను పొడగించేందుకే కేబినెట్ మంత్రులు ముక్తకంఠంతో అభిప్రాయపడుతున్నారని కర్నాటక ముఖ్యమంత్రి బి.ఎస్. యడియూరప్ప తెలిపారు. అయితే తుది నిర్ణయం మాత్రం ప్రధాని నరేంద్ర మోదీతో సంప్రదించిన తర్వాతే తీసుకుంటామని ఆయన గురువారం తెలిపారు. తాను కూడా అదే నిర్ణయాన్ని కేబినెట్ ముందు ఉంచానని ఆయన అన్నారు. కేబినెట్ సమావేశం తర్వాత ఆయన వివరాలను వెల్లడించారు. మరోవైపు హాట్‌స్పాట్ కేంద్రాల్లో కరోనా వైరస్‌ను ఎలా అరికట్టాలన్న దానిపై ఓ నిపుణుల బృందం తమ రిపోర్టును యడియూరప్పకు సమర్పించింది. మే 31 వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యా సంస్థలు ప్రారంభించకూడదని, అలాగే రవాణా రంగాన్ని కూడా అనుమతించవద్దని, అయితే ప్రైవేటు వాహనాలను మాత్రం సరి-బేసి సంఖ్యలో అనుమతించాలని నిపుణుల కమిటీ సిఫార్సు చేసింది.

కరోనాపై పోరుకు కేంద్రం కొత్త ప్రణాళిక

15వేల కోట్ల ఎమర్జెన్సీ ప్యాకేజీ ప్రకటన

న్యూఢిల్లీ,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కోవిడ్19 వైరస్‌పై పోరాటం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రణాళిక రచించింది. దేశంలో మెరుగైన వైద్య సదుపాయాల కల్పన కోసం 15వేల కోట్ల ఎమర్జెన్సీ ప్యాకేజీని ప్రకటించింది. నూరుశాతం కేంద్ర ప్రభుత్వమే ఈ నిధులను విడుదల చేస్తుంది. అయిదేళ్ల పాటు కొనసాగే ఈ స్కీమ్‌లో పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థను రూపొందించేందుకు డబ్బును ఖర్చు చేయనున్నారు. మొత్తం మూడు దశల్లో కోవిడ్19 ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్యాకేజీని అమలు చేస్తారు. జనవరి 2020 నుంచి జూన్ 2020 వరకు, ఆ తర్వాత జూలై 2020 నుంచి మార్చి 2021 వరకు, ఏప్రిల్ 2021 నుంచి 2024 వరకు నిధులను ఖర్చు చేస్తారు. కోవిడ్ హాస్పిటళ్ల అభివృద్ధి, ఐసీయూల ఏర్పాటు, ఆక్సిజన్ సరఫరా కోసం ఈ ప్యాకేజీ నిధులను వినియోగిస్తారు. ఎమ్జ్జంగ్÷న్సీ నిధులతో ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేయనున్నట్లు నేషనల్ హెల్త్ మిషన్ డైరక్టర్ తెలిపారు. తొలి దశలో హాస్పిటళ్లు, గవర్నమెంట్ అంబులెన్స్‌లను డిస్‌ఇన్‌ఫెక్ట్ చేస్తారు. వీటితో పాటు పర్సనల్ ప్రొటెక్షన్ ఇక్విప్మెంట్, ఎన్95 మాస్క్‌లను కూడా ఖరీదు చేస్తారు. కరోనాపై పోరుకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించనున్నట్లు ప్రదాని మోదీ చెప్పిన విషయం తెలిసిందే.

ప్రస్తుతం కోవిడ్19 ఎమ్జ్జంగ్÷న్సీ రెస్పాన్స్ కోసం 7774 కోట్లు కేటాయించారు. మిగతా నిధులను మరో నాలుగేళ్లలో ఖర్చు చేస్తారు. అంటువ్యాధులు సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ల్యాబరేటరీల ఏర్పాటుకు కూడా నిధులను ఖర్చుచేస్తారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎమ్జ్జంగ్÷న్సీ ప్రణాళికలను అమలు చేస్తారు. ఇప్పటికే కేంద్ర ఆరోగ్యశాఖ సుమారు 4113 కోట్లను రాష్ట్రాలు, యూటీలకు రిలీజ్ చేసింది.

ఇళ్లల్లోనే ఉండండి..నాలాగా!

-ఇన్‌స్టాగ్రామ్‌లో స్మృతి పోస్ట్

న్యూఢిల్లీ,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నేపథ్యంలో అందరూ ఇళ్లలోనే ఉండి ఆ మహమ్మారిని తరిమేద్దామంటూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పేర్కొన్నారు. తాజాగా స్మృతి ఇరాని తన ఇన్‌స్టాగ్రామ్‌లో లూస్ హెయిర్‌లో నవ్వుతూ సెల్ఫీ దిగిన ఫోటోను షేర్ చేశారు. 'కరోనా నేపథ్యంలో నేను ఎక్కడికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ హోం క్వారంటైన్ పాటిస్తున్నా. ఈ సందర్భంగా ప్రజలందరు ఇళ్లలోనే ఉంటూ సామాజిక దూరం పాటించాలని కోరుతున్నా. దయచేసి అందరూ ఇంట్లోనే ఉంటూ సురక్షితంగా ఉండండి' అంటూ తెలిపారు. కాగా బుధవారం ప్రఖ్యాత సంగీత విధ్వాంసుడు రవిశంకర్ 100వ పుట్టినరోజు సందర్భంగా ఆయన గుర్తుగా ఒక వీడియోను షేర్ చేశారు. అంతేగాక ఇంట్లోనే ఉంటున్న స్మృతి తన పాతకాలం ఫోటోలను ఎప్పటికప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ అలనాటి జ్ఞాపకాలను ఆస్వాదిస్తున్నారు. కాగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 5వేలకు పైగా కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, మృతుల సంఖ్య 166కు చేరుకుంది.

తెలంగాణలో 471కి చేరిన రోనా పాజిటివ్ కేసులు

రాష్ట్రంలో ఇప్పటి వరకు కరోనాతో 12 మంది మృతి

471 పాజిటివ్ కేసుల్లో 385 మంది మర్కజ్ వెళ్లొచ్చిన వారే

మీడియాకు వెల్లడించిన మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా పాజిటివ్ కేసులు 471కి చేరాయని మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. కరోనా పాజిటివ్ వచ్చిన వాళ్లలో 388 మంది మర్కజ్ వెళ్లొచ్చినవారే అని మంత్రి స్పష్టం చేశారు.

గురువారం మరో 665 శాంపిల్స్ టెస్ట్ చేస్తే 18 పాజిటివ్ వచ్చాయని, రాష్ట్రంలో ఇప్పటి వరకు కరోనాతో 12 మంది మృతి చెందారని ఈటల పేర్కొన్నారు. 45 మంది ఇప్పటికే డిశ్చార్జ్ అయ్యారని, 414 మందికి చికిత్స కొనసాగుతోందని చెప్పారు. రాత్రికి మరికొన్ని టెస్టులు రావాల్సి ఉందని, శుక్రవారం 70 మంది వరకు డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. కేవలం ఒక్కరికే వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోందని, ఈ నెల 22 నాటికి అందరూ డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని మంత్రి ఈటల స్పష్టం చేశారు

మర్కజ్ ఘటన లేకుంటే తెలంగాణ కరోనా రహిత రాష్ట్రం అయ్యేదని ఈటల వెల్లడించారు. గతంలోలా వేల సంఖ్యలో శాంపిల్స్ వచ్చే అవకాశం లేదని ఈటల తెలిపారు. ఇక 471 పాజిటివ్ కేసుల్లో 385 మంది మర్కజ్ వెళ్లొచ్చిన వారు, వారిని కలిసి వ్యక్తులు ఉన్నారని మంత్రి తెలిపారు.

ఇప్పటి వరకు 45 మంది ఈ వైరస్ నుంచి కోలుకుని డిశ్చార్జి అయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న రోగులు ఏప్రిల్ 22వ తేదీ వరకు కోలుకునే అవకాశం ఉందన్నారు. మర్కజ్ కేసులు లేకపోతే కరోనా రహిత రాష్ట్రంగా తెలంగాణ ఉండేదన్నారు మంత్రి. ఇక వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో 60 నుంచి 70 మంది శుక్రవారం డిశ్చార్జి అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా లాక్‌డౌన్ పాటించడం వల్లే కరోనా కేసులు తగ్గాయన్నారు. కరోనా కేసులు ఇంకా తగ్గే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. గురువారం ఒక్కరోజే 665 నమూనాలు పరీక్షిస్తే 18 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయని ఈటల రాజేందర్ తెలిపారు. తెలంగాణలో 101 హాట్‌స్పాట్‌లను గుర్తించామన్నారు. ఈ ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. లాక్‌డౌన్ కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా 15,23,898కు కరోనా కేసులు

కరోనాతో మొత్తం 88,956 మంది మృత్యువాత

కరోనాతో కుదేలైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

న్యూఢిల్లీ,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ వీరవిహారం చేస్తోంది. రోజురోజుకు కరోనా పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 15,23,898 కేసులు నమోదయ్యాయి. గురువారం సాయంత్రానికి ప్రపంచవ్యాప్తంగా 5,938 కేసులను పాజిటివ్ కేసులుగా ప్రకటించారు. అలాగే కరోనా మహమ్మారి వల్ల 501 మంది మరణించారు. ప్రపంచం వ్యాప్తంగా ఇప్పటి వరకు 88,956 మందిని ఈ రక్కసి బలికొంది. దేశంలో ఇప్పటి వరకు 5,734 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, దేశంలో 24 గంటల్లో 17 మంది మృతి చెందారని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. ఇప్పటి వరకు 166 మంది మృతి చెందారని చెప్పారు. రాష్ట్రాలకు పీపీఈ కిట్స్, వెంటిలేటర్లు పంపుతున్నామని, 1.54 కోట్ల పీపీఈ కిట్లకు ఆర్డర్ చేశామని లవ్ అగర్వాల్ పేర్కొన్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం:క్రిస్టలినా

గడచిన శతాబ్దంలో ఎదురైన సంక్షోభాలన్నిటిలో అత్యంత తీవ్ర ప్రభావం చూపుతున్నది కరోనా వైరస్ మహమ్మారి అని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టలినా జార్జీవా అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గ్రేట్ డిప్రెషన్ తర్వాత భారీగా దెబ్బతినడానికి కారణం ఈ మహమ్మారేనన్నారు. 2020లో ప్రపంచ వృద్ధి వ్యతిరేకాత్మకం అవుతుందని హెచ్చరించారు. ఐఎంఎఫ్ సభ్య దేశాలు 180 కాగా, వీటిలో 170 దేశాల్లో తలసరి ఆదాయం క్షీణించిందని చెప్పారు. వచ్చే వారం ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు స్ప్రింగ్ మీటింగ్స్ జరుగుతాయి. కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో ఆంక్షలు అమలవుతుండటంతో ఈ సమావేశాలను డిజిటల్ విధానంలో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టలినా జార్జీవా గురువారం ప్రసంగించారు. నిజానికి తాము గ్రేట్ డిప్రెషన్ తర్వాత అత్యంత దయనీయమైన ఆర్థిక వ్యవస్థ పతనం రాబోతోందని భావిస్తున్నట్లు క్రిస్టలినా తెలిపారు. వచ్చే ఏడాది పాక్షికంగా మాత్రమే కోలుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది చివరికి కరోనా వైరస్ తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలిపారు. పరిస్థితి మరింత దిగజారే అవకాశాలే కనిపిస్తున్నాయని, ఎటు చూసినా తీవ్రమైన అనిశ్చితి కనిపిస్తోందని చెప్పారు. వ్యాపారాలు, కుటుంబాలు కోలుకోవాలంటే ప్రభుత్వాలు మరింత అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే వివిధ దేశాలు దాదాపు 8 ట్రిలియన్ డాలర్ల విలువైన ప్యాకేజీలను ప్రకటించిన సంగతి తెలిసిందే. జనవరిలో ఐఎంఎఫ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, ప్రపంచ వృద్ధి రేటు 2020లో 3.3 శాతం, 2021లో 3.4 శాతం అని అంచనా. అయితే ఆ తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయిన సంగతి తెలిసిందే. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు తారతమ్యాలు లేకుండా, ఒకే విధంగా దెబ్బతిన్నాయని జార్జీవా చెప్పారు.

మిల్లర్స్ అసోసియేషన్ 200 క్వింటాళ్ల బియ్యం అందజేత

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10: లాక్‌డౌన్ నేపథ్యంలో నిరుపేదలు, వలస కూలీల జీవనానికి మహబూబ్‌నగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తమ వంతు బాధ్యతగా చేయూతను అందించింది. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ 200 క్వింటాళ్ల ధాన్యాన్ని అందజేసింది. పంపిణీకి సిద్ధంగా లోడ్‌తో ఉన్న లారీని మంత్రి శ్రీనివాస్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. మహబూబ్‌నగర్ వ్యాప్తంగా నిరుపేదలకు ఈ బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.

అంతకుక్రితం మంత్రి మహబూబ్‌నగర్ పట్టణంలోని యేనుగొండ ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేదలకు నిత్యవాసర సరుకులను పంపిణీ చేశారు.

భారత్‌లో పెరిగిన కరోనా కేసులు: లవ్ అగర్వాల్

న్యూఢిల్లీ,ఏప్రిల్ 10: భారత్‌లో కరోనా కేసులు వేగంగా పెరుగుతున్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ తెలిపారు. తాజాగా కేంద్ర ఆరోగ్య శాఖ హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. గడచిన 24 గంటల్లో 678 కొత్త కేసులు నిర్ధారణ కాగా 33 మంది చనిపోయారు.

భారత్‌లో ఇప్పటి వరకు మొత్తం 6,412 కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదు కాగా.. 199 మంది మరణించారు. 503 మంది కరోనా బాధితులు కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు.

'నిన్న ఒక్కరోజే 16002 శాంపిల్స్ టెస్ట్ చేశాం. 2 కోట్ల హైడ్రోక్లోరోక్విన్ టాబ్లెట్స్ సిద్ధంగా ఉన్నాయి. విదేశాల్లో ఉన్న భారతీయులను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. జనవరిలో మనకు ఉన్నది ఒకే ఒక్క ల్యాబ్. ప్రస్తుతం దేశంలో 146 ప్రభుత్వ ల్యాబ్స్, 67 ప్రైవేట్ ల్యాబ్స్ అందుబాటులో ఉన్నాయని' లవ్ అగర్వాల్ తెలిపారు.

మహారాష్ట్రలో కొత్తగా 162 కేసులు నమోదు

కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 1,297కి చేరిక

ఏడాది పాటు ఎమ్మెల్యేల జీతంలో 30 శాతం కోత

సిఎం ఉద్ధవ్ థాక్రేను మండలికి నామినేట్చేస్తూ కేబినేట్ నిర్ణయం

ముంబై,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో గురువారంనాడు కొత్తగా 162 కేసులు నమోదు కావడంతో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 1,297కి చేరినట్టు రాష్ట్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.కోవిడ్-19 లాక్‌డౌన్ కారణంగా రాష్ట్రానికి ఏర్పడిన ఆర్థిక నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని మహారాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఏడాది పాటు ఎమ్మెల్యేల జీతంలో 30 శాతం కోత విధించే ప్రతిపాదనకు మంత్రివర్గం గురువారంనాడు ఆమోదం తెలిపింది. ఏప్రిల్‌తో ప్రారంభించి ఏడాది పాటు వేతనంలో కోత అమలవుతుందని క్యాబినెట్ సమావేశానికి సారథ్యం వహించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మీడియాకు తెలిపారు. ఇప్పటికే కర్నాటక కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకుంది. ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరేను శాసన మండలికి నామినేట్ చేస్తూ ఓ నిర్ణయాన్ని కూడా క్యాబినెట్ ఆమోదించినట్టు అజిత్ పవార్ వెల్లడించారు. లాక్‌డౌన్ అనంతరం తలెత్తిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి, దానిని తిరిగి పునరుద్ధరించేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై రెండు కమిటీలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొదటి కమిటీలో మహారాష్ట్ర ఆర్థిక శాఖకు చెందిన అధికారులు, మాజీ ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉంటారు. రెండో కమిటీ

పోచారం మున్సిపాలిటీలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ

మేడ్చల్ మల్కాజ్‌గిరి, ఏప్రిల్ 10: లాక్‌డౌన్ నేపథ్యంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించొద్దన్న ప్రభుత్వ పిలుపుమేరకు ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలకు ఉపక్రమించారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి నేడు పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడలోని శివాస్ గార్డెన్‌లో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. దాదాపు 700 మంది నిరుపేదలకు, మున్సిపల్ సిబ్బందికి బియ్యం, పప్పు, కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలీసులకు శాల్యూట్ చేస్తూ చిరు వీడియో సందేశం

వారి కష్టాన్ని గుర్తించి సహకరించాలని ప్రజలకు వినతి

చరింజీవి వీడియో స్ఫూర్తిదాయకమన్న డిజిపి మహేందర్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ కట్టడిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 21 రోజుల లాక్‌డౌన్‌ని ప్రకటించిన దరిమిలా పోలీసులు కట్టుదిట్టంగా దానిని అమలు చేసేందుకు కష్టపడుతున్నారు. ఈ లాక్‌డౌన్ సజావుగా సాగేలా పోలీస్ వారు చేస్తున్న నిరంతర కృషిపై సినీ సెలబ్రిటీలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

తఇప్పటికే పోలీస్ వారి త్యాగాన్ని గుర్తించి వారికి నాగ చైతన్య, మహేష్ బాబు సెల్యూట్ చేయగా, తాజాగా మెగాస్టార్ చిరంజీవి .. పోలీస్ బిడ్డగా పోలీస్ వారికి సెల్యూట్ చేస్తున్నానని తన ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల పోలీసుల పనితీరు అద్భుతం. నిద్రాహారాలు మాని వాళ్ళు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. నేను హైదరాబాద్‌లో స్వయంగా చూస్తున్నాను. వారి పనితీరు వలన లాక్‌డౌన్ సక్సెస్ ఫుల్ గా జరుగుతుంది. అలా జరగబట్టే కరోనా విజృంభణ చాలా అదుపులోకి వచ్చింది. అలాగే సామాన్య జనం కూడా పోలీసులకి సహకరించాలి. కరోనాని అంతమొందించేందుకు వారికి చేదోడు వాదోడుగా ఉండాలి. పోలీస్ వారు చేస్తున్న ఈ అమోఘమైన ప్రయత్నాన్ని పోలీస్ బిడ్డగా వారికి సెల్యూట్ చేస్తున్నాను అని చిరంజీవి తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కరోనా వ్యాప్తిని అరికట్టాలంటే లాక్ డౌన్ ఒక్కటే పరిష్కారం అని ప్రభుత్వాలు చెప్పడంతో పోలీసులు ప్రజలను ఇంటికే పరిమితం చేస్తూ కఠిన ఆంక్షలు పెడుతున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులు సక్రమంగా అమలుగా కావడానికి, ప్రజలు బయటికి రాకుండా చేయడానికి పోలీసులు రాత్రింబవళ్లు కష్టపడి రోడ్లపై డ్యూటీ చేస్తున్నారు. వీరి శ్రమను కొనియాడుతూ, కష్టానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఓ ప్రత్యేక వీడియో సందేశం పంపారు. పోలీసుల నిరంతర శ్రమకు ఆయన సెల్యూట్ చేశారు. చిరు ట్వీట్‌కి స్పందించిన తెలంగాణ డీజీపీ .. మీరు మమ్మల్నే కాదు, అందరికి స్ఫూర్తిగా ఉంటారు. మిమ్మల్ని ఆదర్శంగా తీసుకునే ఎంతో మందిని మీ మాటలతో చైతన్యవంతులని చేశారు. పోలీస్ కుటుంబం నుండి వచ్చిన మీరు చెప్పిన మాటలు కోవిడ్ 19కి వ్యతిరేకంగా మేం చేసే యుద్ధంలో మాకెంతో సాయపడతాయి . మీ మాటలు ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్‌ని పాటించేలా చేస్తాయి అని డీజీపీ తెలంగాణ పోలీస్ మహేందర్ రెడ్డి.. చిరు ట్వీట్‌కి స్పందించారు.

మోదీజీ.. వలస కూలీలను వారి స్వస్థలాలకు చేరేలా చూడండి'

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:: దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తమ స్వస్థలాలకు తరలివెళ్తున్న వలస కూలీలను వారి ఇళ్లకు చేరుకునేలా సహాయం అందించాలని లోక్‌సభలో కాంగ్రెస్‌పార్టీ నేత అధిర్ రంజన్ చౌధురి ప్రధాని మోదీని కోరారు. కరోనాను కట్టడి చేయడానికి దేశ వ్యాప్తంగా 21 రోజుల లాక్‌డౌన్‌ను ప్రధాని మార్చి 24న ప్రకటించారు. దీంతో చేసేందుకు పనులు లేకపోవడంతో జీవనోపాధి కోసం నగరాలకు వలస వచ్చిన కూలీలు తమ స్వస్థలాలకు బయలు దేరారు. అయితే రవాణా సదుపాయాలు లేకపోవడం కాలినడకన బయల్దేరారు. దీంతో కరోనాకు సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం, తిండి, బట్టలు సరిగా లేకుండానే రోజుల కొద్ది తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారని, అందువల్ల వారంత త్వరగా వారి ఇళ్లకు సురక్షితంగా చేరేలా చూడాలని ఆయన ప్రధానికి లేఖ రాశారు. ఇలా తమ స్వస్థలాలకు వెళ్తున్న నిస్సహాయులైన కూలీల కోసం ప్రత్యేకంగా కోవిడ్ ప్రొటెక్షన్ రైలును ఏర్పాటు చేయాలని ప్రధానిని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో మాస్కుల ధరింపు తప్పనిసరి

ఒక్కసారి వాడినివి మళ్లీమళ్లీ వాడరాదు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మాస్కులు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇళ్ల నుంచి బయటకు వస్తే కచ్చితంగా మాస్కులు వాడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వైరస్ సోకినా చాలా మందికి లక్షణాలు కనబడవని, అలాంటివారు కరోనా వైరస్‌ను వ్యాప్తి చేసే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతోంది. వైరస్ సోకకుండా రక్షణ చర్యలు తీసుకోవడమే ఉత్తమమని అధికారులు సూచిస్తున్నారు. ఇతరు నుంచి వ్యాధి సంక్రమించకుండా ఉండాలంటే మాస్కులు తప్పనిసరని పేర్కొంది. ఆఫీసులు, పని చేసే ప్రాంతాల్లో తప్పనిసరిగా మాస్కులు ఉపయోగించాలని, రెండు పొరలు ఉన్న కాటన్ వస్త్రాన్ని కూడా వాడొచ్చని ప్రభుత్వం చెబుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రజలు మాస్కులు వాడాలని, మూతి, ముక్కు, గడ్డం పూర్తిగా కప్పేలా మాస్క్ ధరించాలని అధికారులు పేర్కొన్నారు. చేతులు కడుక్కోని మాస్క్ వేసుకోవాలని, మాస్కులు ఒకసారే వినియోగించాలని, వాషబుల్ మాస్కులు ధరించడం మేలని ప్రభుత్వం సూచిస్తోంది. వాడిన మాస్కులను మూతవున్న చెత్తబుట్టలో వేసి చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు కొందరిలో ఎలాంటి లక్షణాలు లేకుండా కరోనా గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రజల కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

–పలు కుటుంబాలకు నిత్యాసవరాలు పంపిణీ చేసిన తలసాని

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా నియంత్రణ కోసం లాక్‌డౌన్ అమలవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విజ్ఞప్తిచేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజక వర్గం పరిధిలోని వెంగరళరావు నగర్‌డివిజన్ కళ్యాణ్ నగర్‌లో పోలీసులు, జీహెచ్ఎంసి, వాటర్‌వర్క్స్ సిబ్బంది కుటుంబాలకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యంగా పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటుందని దాతలు కూడా ముందుకు రావాలని అన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వ నిర్ణయాలకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం సూచించిన విధంగా ఇండ్లలోనే ఉండి కరోనా నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి, యూసుఫ్ కాలనీ ఛైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి హరీష్ రావు

పంటనష్టాన్ని అంచనావేయాలని అధికారులకు ఆదేశాలు

సిద్దిపేట,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులు ఆదుకుంటుందని మంత్రి హరీశ్ రావు తెలిపారు. రైతులు అధైర్యపడకుండా ఉండాలని, పంట అమ్మె దగ్గర, ఇతర ప్రదేశాల్లో సామాజిక దూరం పాటించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని కొమురవెల్లి మండలంలో మంత్రి పర్యటించారు. కొమురవెల్లి మండలంలోని గౌరయ పల్లి, కిష్టంపేట.. కొండపాక మండలంలోని బందారం, దర్గా గ్రామాల్లో అకాల వడగండ్ల వర్షానికి నేల రాలిన వరి పంట నష్టాన్ని పరిశీలించిన మంత్రి పరిశీలించారు. ఆయనతో పాటు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పద్మాకార్, ఆర్డీఓ అనంతరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్ ఉన్నారు. వడగండ్ల వానతో నష్టపోయిన పంట పొలాలను మంత్రి పరిశీలించారు. పంట నష్టంపై త్వరితగతిన నివేదిక రూపొందించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పీఎం కిసాన్ యోజన బీమా కట్టిన రైతులకు సంబంధించిన జాబితాను రూపొందించి ఇన్సురెన్స్ అధికారులకు సమాచారం అందించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వడగండ్ల వర్షానికి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రి హరీష్ రావు తెలిపారు. వడగండ్ల వర్షానికి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పంట ఇన్సూరెన్స్ ఉన్నవారికి, లేని వారికి కూడా పంట నష్టాన్ని ప్రభుత్వం నుంచి అందిస్తామన్నారు. కొమురవెల్లి మండలంలో సుమారు వేయి ఎకరాల వరి పంట నష్టం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పంట నష్టాన్ని ప్రతి రైతుకు అందిస్తామన్నారు. రెవెన్యూ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను మొత్తంగా నష్టాన్ని పరిశీలించమని అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని మంత్రి హరీష్ తెలిపారు.

కేటీఆర్‌ని కలిసి విరాళం అందించిన సినీ పెద్దలు

హైదరాబాద్, ఏప్రిల్ 10:కరోనా కట్టడిలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలకి తమ వంతు చేయూతనందిస్తున్నారు పలువురు సినీ ప్రముఖులు. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ పతాకంపై ఎన్నో అద్భుతమైన సినిమాలు నిర్మించిన దిల్ రాజు తెలంగాణ ప్రభుత్వ సహాయనిధికి తన వంతు సాయంగా రూ. 10లక్షలు ఇస్తానని గతంలో ప్రకటించారు. ఇందులో భాగంగా కొద్ది సేపటి క్రితం మంత్రి కేటీఆర్‌ని కలిసి చెక్ అందించారు దిల్ రాజు, శిరీష్.అలానే తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు సీఎం సహాయార్థంలో భాగంగా రూ.25 లక్షల రూపాయల చెక్‌ని కేటీఆర్‌కి అందించారు. రామ్ మోహన్, సునీల్ నారంగ్, మురళీ మోహన్, తలసాని శ్రీనివాస్ యాదవ్,అభిషేక్ నామా తదితరులు కేటీఆర్‌ని కలిసిన వారిలో ఉన్నారు. తెలంగాణ ప్రజల కోసం వారు చేస్తున్న సాయాన్ని కేటీఆర్ అభినందించారు.

ప్రతిరైతూ పంటకు బీమా చేయించాల్సిందే

వడగళ్ల కారణంగా పంట నష్టాలపై ఆరా

కేబ ఇనేట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): వ్యవసాయం చేసే ప్రతి రైతూ ఎల్ఐసీ చేయించుకున్నట్టుగానే తమ పంటలకు ఖచ్చితంగా బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సూచించారు. దురదృష్ట వశాత్తూ వడగండ్ల వానతో దాదాపు 25 వేల ఎకరాల్లో పంటనష్టం వచ్చిందన్నారు. దీంతో రైతుల నోటికాడి పంట నేలపాలైందన్నారు. పంటనష్టం పై సమగ్ర సమాచారం తెప్పించుకుని రైతులను ఎలా ఆదుకోవాలో కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. తెలంగాణలో ఈ సంవత్సరంలో 50 లక్షల ఎకరాల్లోవ్యవసాయ ఉత్పత్తులు పండినట్టు నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు జమ్మాపూర్ గ్రామంలో మంత్రి పర్యటించారు. మంత్రి వెంట స్థానిక లోక్‌సభ సభ్యులు పోతుగంటి రాములు, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ తదితరలు ఉన్నారు. గ్రామంలో సోడియం హైపోబై కార్బోనేట్ ద్రావణం పిచికారి చేశారు. గోప్లాపూర్, దవాజీపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వెళ్లకుండా ప్రభుత్వానికి సహకరించాలి. రైతులు తమ ధాన్యంను కోసిన వెంటనే వ్యవసాయ శాఖకు సమాచారం ఇచ్చి టోకెన్లు తీసుకోవాలి. ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు సామాజిక దూరం పాటించాలని కోరారు. రాష్ట్రంలో 6లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 3లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటలు, లక్ష ఎకరాల్లో ఆకు, కూరగాయలు పండినంట్టు తెలిపారు. కరెంట్, సాగునీరు, పంటపెట్టుబడి ఇస్తూ ప్రభుత్వం రైతులకు తోడ్పాటును అందిస్తోందన్నారు. పంట సాగులోరైతులు ఎంతో ఇష్టంగా పాల్గొన్నారని తెలిపారు. గతంలో చెరువులు, కుంటలు నిండినప్పుడే శిస్తుచేసేది, కానీ ఇప్పుడు సాగునీటి రాకతో ప్రతి ఏటా లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయని, త్వరలోనే కోటి ఎకరాల సాగు స్వప్నం నిజం అవుతుందన్నారు. తెలంగాణలో భవిష్యత్‌లో నీటి కొరత అన్నది రాకుండా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వరి వేసే రైతులు మార్చి వరకూ కోతకు వచ్చేలా ప్రణాళిక చేసుకోవాలని, ఏప్రిల్ వరకు ఆగితే వర్షాలు బారిన పడే ప్రమాదం ఉందని ఆ వర్షాలను మనం ఆపలేమన్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పంటలకు భారీ నష్టం

నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయాధికారులు

మెదక్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా పలుచోట్ల కురిసిన వడగండ్ల వాన రైతులకు నష్టాన్ని మిగిల్చింది. పలుప్రాంతాల్లో బుధ,గురువారాల్లో కురిసిన వడగళ్లకు వరి, మొక్కజోన్న, మామిడిపంటలు దెబ్బతిన్నాయి. వడగండ్లతో వరి పంటకు నష్టం వాటిల్లింది. మిరుదొడ్డి మండల పరిధిలోని ఆరెపల్లి, లక్ష్మీనగర్ గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానకు వడ్లు రాలి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట అర్బన్ పరిధిలోని రంగదాంపల్లిలో గురువారం సాయంత్రం కురిసిన వడగండ్ల వర్షంతో వరిపంటలకు తీవ్ర నష్టం కలిగింది. చేర్యాల మండలంలోని నాగపురి, కడవేర్గు, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి, వేచరేణి, మద్దూరు మండలంలోని కమలాయపల్లి గ్రామాల్లో గురువారం వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి మండలాలలో భారీ వర్షం కురిసింది.బలమైన గాలులకు పలు గ్రామాల్లో చెట్లు నేలకూలినట్లు గ్రామస్తులు తెలిపారు. మెదక్ జిల్లా రామాయంపేటతో పాటు కోమటిపల్లి, మండలంలోని తొనిగండ్ల గ్రామాల్లో భారీ వాన కురిసింది. తొనిగండ్ల గ్రామంలో 30 మంది రైతులకు చెందిన వరి పంట 28 ఎకరాల్లో వరి గింజలన్నీ నేలరాలాయి. కోమటిపల్లి గ్రామంతో బాటు రామాయంపేట పట్టణంలోని 20మంది రైతులకు చెందిన పంటపొలాల్లో వడగండ్ల వర్షం పడడంతో 27 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. గురువారం వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించారు. వెల్దుర్తి మండలంలో దెబ్బతిన్న పంటను వ్యవసాయాధికారి మాలతి పరిశీలించారు.వివరాలను నమోదు చేసి నష్టం అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు ఆమె తెలిపారు. చిన్న శంకరంపేట మండలం ఎస్.కొండాపూర్, గవ్వలపల్లి, చందాపూర్, జంగరాయి గ్రామాల్లో 94మంది రైతులకు చెందిన 110ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఏవో శ్రీనివాస్ తెలిపారు. పాపన్నపేట మండల పరిధిలోని దౌలాపూర్ పాపన్నపేట, కుర్తివాడ, యూసుఫ్‌పేట, మిన్‌పూర్, లింగాయపల్లి, అబ్లాపూర్, అన్నారం, పొద్చన్‌పల్లి గ్రామాలలో 463 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు వ్యవసాయశాఖ అధికారి ప్రతాప్‌కుమార్ వెల్లడించారు. గురువారం మెదక్ ఏడీఏ నగేశ్ పాపన్నపేట మండల వ్యవసాయశాఖ అధికారి ప్రతాప్‌కుమార్ ఏతవోలు రజిత, జనార్దన్, అభిలాష్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు రైతులు నష్టపోయిన పంటలను పరిశీలించారు. మెదక్ మండలంలో సుమారు 754 ఎకరాలలో వరిపంటకు నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. నర్సాపూర్ మండల పరిధిలోని రుస్తుంపేట్ గ్రామంలో 25 ఎకరాలు, రాంచంద్రపూర్ గ్రామంలో 29 ఎకరాలు మొత్తం 54 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగిందని ఏవో వెంకటేశ్వర్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంతో పాటు గురువన్నపేట, పొసాన్‌పల్లి, తపాన్‌పల్లి, ఐనాపూర్, మర్రిముచ్చాల, గౌరాయపల్లి, రాసూలాబాద్ గ్రామాల్లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. మర్రిముచ్చాల, గౌరాయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. నంగునూరు మండలం సిద్దన్నపేట, ముండ్రాయి, వెంకటాపూర్, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో వడగండ్ల వానతో వరి పంటకు నష్టం వాటిల్లింది. ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ అధికారి గీత, రైతుబంధు మండల అధ్యక్షుడు కిష్టారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో కురిసిన వర్షానికి వరి పంట దెబ్బతిన్నది. కొండపాక మండలంలోని బందారం, దర్గా, అంకిరెడ్డిపల్లి, దు÷-దడెద తదితర గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది.

రాష్ట్రాలతో కలసి కట్టుగా కరోనాపై పోరు

ముమ్మరంగా వ్యాక్సిన్ తయారీ ప్రయోగాలు

రాష్ట్రాల ఆరోగ్యశాఖల మంత్రులతో హర్షవర్ధన్ వీడియో సమీక్ష

న్యూఢిల్లీ,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పోరాటం చేస్తున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. కరోనా వ్యాక్సిన్ తయారీకి ప్రయోగాలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. కొన్ని రాష్ట్రాల్లో కరోనా ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. కరోనాను తరిమికొట్టడంలో అందరూ మాస్కులు ధరించడం అత్యంత ప్రధానం అని పేర్కొన్నారు. కరోనాపై అన్ని రాష్ట్రాల ఆరోగ్యశాఖ మంత్రులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. కేంద్ర వైద్యారోగ్యశాఖ సహాయ మంత్రి అశ్విని కుమార్ చౌబేతో కలిసి ఢిల్లీలోని నిర్మాణ్ భవన్ నుంచి హర్షవర్ధన్ వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. కరోనా కట్టడికి వివిధ రాష్ట్రాల్లో తీసుకుంటున్న చర్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరోనా చైనా నుంచి మిగిలిన దేశాలకు విస్తరించిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు కరోనా 212 దేశాలకు వ్యాపించిందన్నారు. కరోనాపై యుద్ధానికి అందరూ సహకరిస్తున్నారన్నారు. కరోనాకు సరిహద్దులంటూ ఏమీ లేవన్నారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్ హైదరాబాద్‌లోని బూర్గుల భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈటెల మాట్లాడుతూ.. రాష్ట్రం, దేశంలో తయారవుతున్న మందులు, వైద్య పరికరాలకు సంబంధించిన టాక్స్‌ను ఎత్తివేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వాటికి కస్టమ్స్, టాక్స్ రద్దు చేయాలని కోరారు. రాష్ట్రానికి ఎన్--95 మాస్క్ లు, కిట్స్, టెస్టింగ్ కిట్స్ వీలైనంత తొందరగా పంపించాలని హర్షవర్ధన్‌ను కోరారు. కాగా ఇప్పటివరకు తెలంగాణలో కమ్యూనిటీ ట్రాన్స్మిషన్ జరగలేదని, ఇక్కడ వచ్చిన పాజిటివ్ కేసుల్లో 85 శాతం మర్కజ్ నుంచి వచ్చినవారివేనని కేంద్ర మంత్రికి వివరించారు. తెలంగాణలో

మర్కజ్ కేసుల మినహా కరోనా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అని ఈటల రాజేందర్ హర్షవర్ధన్‌కు వెల్లడించారు.

దాతృత్వాన్ని చాటుకుంటున్న దాతలు

వరంగల్ రూరల్,ఏప్రిల్ 10: కరోనా విపత్తులో ఆర్థిక లోటుని సైతం అదిగమిస్తూ, ప్రజలకు నిరంతరంగా సేవలు అందిస్తున్న ప్రభుత్వాలకు మేమున్నామంటూ అండగా అనేక మంది వ్యక్తులు, సంస్థలు ముందుకు వస్తున్నాయి.

విరాళాలు అందిస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నాయి. తాజాగా స్పైసెస్ రంగంలో పేరున్న కరానీ గ్రూపు రూ.5.62 లక్షల విరాళాన్ని ప్రకటించింది. ఇందులో సీఎం సహాయ నిధికి రూ. 2.11 లక్షలు, పీఎం కేర్స్ ఫండ్ కి రూ.3.51లక్షల విరాళాన్ని అందించింది. ఈ మెత్తాన్ని రెండు వేర్వేరు చెక్కుల రూపంలో కరానీ కంపెనీ ప్రతినిధులు పర్వతగిరిలో ఉన్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు అందజేశారు.

వరంగల్ జిల్లా పర్వతగిరిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును కలిసి 5.62 లక్షల చెక్కులను సిఎం, పిఎం సహాయనిధికి అందించిన కరానీ స్పైసెస్ గ్రూపు సభ్యులు

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

రాత్రిపూట దొంగతనాలు

హైదరాబాద్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): నగర పోలీసులు అంతర్ రాష్ట్ర దొంగను అరెస్ట్ చేశారు. రాత్రి సమయాల్లో కారులో వెళ్లి తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న పొలకి అప్పల నాయుడు అనే అంతర్ రాష్ట్ర పాత నేరస్తుడిని నగరానికి చెందిన మీర్‌పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం నాడు రాచకొండ సీపీ మహేశ్ భగవత్ మీడియాకు వివరాలు వెల్లడించారు. నిందితునిపై 2019 నుంచి ఇప్పటి వరకు 25 కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. నిందితుని వద్ద నుంచి 40 లక్షల విలువైన 725 గ్రాముల బంగారు ఆభరణాలు, 4 లక్షల నగదు, 2 ఎల్ఈడీ టీవీలు, ఒక కారునుస్వాధీనం చేసుకున్న సీపీ తెలిపారు. కాగా.. నిందితునిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తున్నట్లు సీపీ మీడియాకు వెల్లడించారు.

ఆర్థిక సవాళ్లపై చర్చించిన భారత్, జపాన్ ప్రధానులు

న్యూఢిల్లీ, ఏప్రిల్10: కరోనా వైరస్ ప్రభావం వల్ల ఎదురయ్యే ఆరోగ్య, ఆర్థిక సవాళ్లను గురించి ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని షింజోతో అబే చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ వ్యాప్తిని గురించి ఇరువురు నేతలు టెలిఫోన్‌లో మాట్లాడారు. కరోనాను కట్టడి చేయడానికి, ప్రస్తుత విపత్తును ఎదుర్కోవడానికి ఇరు దేశాలు సహాయ సహకారాలు అందించుకోవడంపై, తమ ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై ఇరువురు నేతలు సంతృప్తి వ్యక్తంచేశారు. ఇరుదేశాల మధ్య పరస్పర సహకారం ఇదేవిధంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారని కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. దీనికి సంబంధించి జపాన్ ప్రధాని షింజో అబేతో ఫలవంతమైన చర్చలు జరిగాయని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. కరోనా తదనంతరం ప్రపంచానికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి భారత్, జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తచేశారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.